సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా సోమసుందరం



నర్సీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా సామాజిక వన విభాగం అటవీ అధికారిగా ఎం.సోమసుందరం నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన జి.లక్ష్మణ్ జూన్ 30వ తేదీన పదవి విరమణ చేశారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. తాజాగా రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కన్జర్వేటర్స్‌కు పోస్టింగ్స్ ఇచ్చే క్రమంలో అదే కేడర్‌లో ఉన్న సోమసుందరాన్ని అనకాపల్లి జిల్లా సామాజిక వన విభాగం అధికారిగా నియమించారు. ఈయన గతంలో ఉత్తరాంధ్ర జిల్లాల అటవీ శాఖ స్క్వాడ్ డీఎఫ్‌వోగా పనిచేశారు.

గోవాడ షుగర్స్‌పై నీలినీడలు!

ఈ ఏడాది క్రషింగ్ లేనట్టేనా?



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

- రైతులు, కార్మికులు, సప్లయర్లకు రూ.40 కోట్ల మేర బకాయిలు
- ఫ్యాక్టరీలో ఉన్న పంచదార, మొలాసిస్ విలువ రూ.10 కోట్లు
- మహాజన సభ నిర్వహణకు అధికారుల వెనుకంజ
- ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలింపుపై మంతనాలు
- ప్రభుత్వ నిర్ణయంపైనే ఫ్యాక్టరీ భవిష్యత్తు

చోడవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): **సహకార రంగంలో అగ్రగామిగా వెలుగొందిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీని చీకట్లు అలముకున్నాయి. కొన్నేళ్ల నుంచి నష్టాల్లో నడుస్తున్న ఈ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాదికి ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ సాధ్యం కాదని ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉన్నతాధికారులు తేల్చిచెప్పినట్టు సమాచారం. చెరకు రైతులకు ఇబ్బంది కలగకుండా చెరకును పొరుగు జిల్లా ఫ్యాక్టరీకి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు సూచించినట్టు తెలిసింది.**

ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వున్నప్పటికీ గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో రానున్న సీజన్‌లో క్రషింగ్ జరుగుతుందన్న ఆశాభావంతో రైతులు చెరకు సాగు కొనసాగించారు. ఏటా సెప్టెంబరు నెలాఖరులోగా గోవాడ ఫ్యాక్టరీ మహాసభ నిర్వహిస్తుంటారు. కానీ ఈ ఏడాది ఇంతవరకు మహాజన సభ నిర్వహణపై అధికారులు ఎటువంటి ప్రకటన చేయలేదు. గత రెండు సీజన్లకు సంబంధించి రైతులకు చెరకు బకాయిలు, రవాణా చార్జీలు కలిపి రూ.29 కోట్లు చెల్లించాల్సి వుంది. ఇక కార్మికులకు ఐదు నెలల వేతన బకాయిలు, ఉద్యోగ విరమణ చేసిన సిబ్బంది రూ.7 కోటల వరకు చెల్లించవలసి ఉంది. ఇక సప్లయర్లకు మరో రూ.3 కోట్లు పెండింగ్‌లో వున్నాయి. మొత్తం బకాయిలు రూ.40 కోట్లు వున్నాయి. ఫ్యాక్టరీలో 50 వేల క్వింటాళ్ల పంచదారతోపాటు, మొలాసిస్ వుంది. వీటిని విక్రయిస్తే రూ.10 కోట్లకు మించి వచ్చే పరిస్థితి లేదు. మహాజన సభ నిర్వహిస్తే రైతులు, కార్మికులు తమ బకాయిల గురించి నిలదీస్తారన్న ఉద్దేశంతో అధికారులు మహాజన సభను నిర్వహించడానికి వెనుకంజ వేస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ ప్రభుత్వం నిధులు సమకూర్చితే.. అప్పుడు మహాజన సభ నిర్వహించే అవకాశం ఉందని అంటున్నారు. ఒకవేళ ఫ్యాక్టరీలో క్రషింగ్ నిర్వహించలేని పరిస్థితి ఏర్పడితే.. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో వున్న చెరకును శ్రీకాకుళం జిల్లా సంకిలిలోని ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీ తీసుకెళ్లేలా ఆ ఫ్యాక్టరీ అధికారులతో 'గోవాడ' అధికారులు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ఇటీవల సంకిలి ఫ్యాక్టరీ ఫీల్డు సిబ్బంది, గోవాడ ఫ్యాక్టరీ ఫీల్డు సిబ్బందికి ఫోన్లు చేసి ఏయే కాటాల పరిధిలో ఎంతెంత చెరకు ఉన్నదీ వాకబు చేయడంతోపాటు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్టు చెబుతున్నారు. మొత్తం మీద గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది చెరకు క్రషింగ్ జరిగే అవకాశాలు చాలా తక్కువని అర్థం అవుతున్నది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే ఫ్యాక్టరీ భవిష్యత్తు ఆధారపడి వుందని అధికారులు అంటున్నారు.



మహిళకు స్మార్ట్ రేషన్ కార్డు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు.

స్మార్ట్ రేషన్ కార్డుతో అవకతవకలకు అడ్డుకట్ట

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- పెదబొడ్డేపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

నర్సీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులతో చౌక ధర దుకాణాల్లో అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో పలువురికి క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్డులో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే లబ్ధిదారులకు ఇచ్చిన రేషన్ వివరాలు తెలుస్తాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,31,492 కుటుంబాలకు, నర్సీపట్నం నియోజకవర్గంలో 83,779 కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని, సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి వీటిని అందజేస్తారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, నర్సీపట్నం ఆర్డీవో వీవీరమణ, తహశీల్దార్ రామారావు, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి రమణ, వైస్‌చైర్మన్ చిటికెల కన్నయ్యనాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనపై స్పష్టమైన కార్యాచరణ

- రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



- 8లో

సర్వే రాళ్లు మాయం!

పట్టించుకోని అధికారులు

జగనన్న భూ రక్ష పేరుతో వైసీపీ హయాంలో నిధులు దుర్వినియోగం

- పెద్ద ఎత్తున సర్వే రాళ్లు కొనుగోలు
- వీటిపై నాటి సీఎం జగన్ ఫొటో
- సర్వే రాళ్లలో కొన్ని మాత్రమే వినియోగం



అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ కార్యాలయం వద్ద సర్వే రాళ్లు

- మిగిలిన వాటిని నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసి కొనుగోలు చేసిన కొనుగోలు చేసిన సర్వే రాళ్లకు రక్షణ కొరవడడంతో మాయం అవుతున్నాయి. సర్వే రాళ్లపై వున్న 'వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష' పేరుతోపాటు జగన్ చిత్రాన్ని కూడా చెరిపేసి, రాళ్లను వినియోగించాలన్న ప్రభుత్వ ఆదేశాలను రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. సర్వే రాళ్లను ఎక్కడపడితే అక్కడ పడేయడంతో కొంతమంది స్థానికులు గోడల నిర్మాణానికి వీటిని వినియోగించుకుంటున్నారు.

గత ప్రభుత్వం 'వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష-2020' పేరుతో జిల్లాలో మొత్తం 733 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టింది. అయితే గత ఏడాది సార్వత్రిక ఎనికలనాటికి 475 గ్రామాల్లో మాత్రమే రీసర్వే పూర్తయ్యింది. భూ సరిహద్దులకు రాళ్ల పాతేందుకు గత ప్రభుత్వం తొలివిడత కింద జిల్లాకు 5.38 లక్షల సర్వే రాళ్లను మంజూరు చేసింది. వీటి తయారీ కాంట్రాక్టును రాయలసీమ ప్రాంతానికి చెందిన ఒక వైసీపీ నేతకు అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ నుంచి ప్రభుత్వం సర్వే రాళ్లను కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1.2 కోట్లు చెల్లించింది. అయితే సర్వే రాళ్లలో కొన్నింటిని మాత్రమే వినియోగించారు. మిగిలిన రాళ్లను పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల వద్ద ఆరుబయట వదిలేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సర్వే రాళ్ల వినియోగం పెద్ద సమస్యగా మారింది. సర్వే రాళ్లపై వున్న 'వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష-2020' అక్షరాలను, జగన్ చిత్రాన్ని చెరిపేసి, వినియోగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సర్వే విభాగం అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. సర్వే రాళ్లు ఎన్ని వున్నాయో తమ వద్ద లెక్కలు లేవని పలు మండలాల అధికారులు చెబుతున్నారు. అనకాపల్లి, రోలుగుంట, గొలుగొండ, కశింకోట, నాతవరం, ముగనపాక, రాంబిల్లి మండలాల్లో సర్వే రాళ్లు కనిపించడం లేదు. వైసీపీకి చెందిన కొంతమంది స్థానిక నాయకులు సర్వే రాళ్లను గోడల నిర్మాణంలో వినియోగించినట్టు సమాచారం.

ముసురు వాతావరణం

- పలు మండలాల్లో మోస్తరు వర్షం
- మరో రెండు రోజులపాటు అధిక వర్షాలు కురిసే అవకాశం

అనకాపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు వర్షం, మరి కొన్ని మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. ఎస్.రాయవరం, నక్కపల్లి, కశింకోట, బుచ్చెయ్యపేట, మాకవరపాలెం, రావికమతం, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దఫదఫాలుగా వర్షం కురిసింది. అనకాపల్లి, చోడవరం, మునగపాక, పాకయరావుపేట, కృష్ణాదేవిపేట మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డా యి. మారో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని భూ ముల్లో వరి నాట్లు మునిగిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పరవాడ, పరిసర ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు మోస్తరు వర్షం కురిసింది. శివారు గ్రామాలకు వెళ్లే రహదారులు చిత్తడిగా మారాయి. చోడవరం మండలంలో ముసురు వాతావరణం నెలకొని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మోస్తరు వర్షం కురి సింది. మాడుగుల మండలంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి జల్లులు పడ్డాయి.

యువకుని అనుమానాస్పద మృతి

పోలీసు స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన

- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ

నర్సీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): **నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితి మృతిచెందిన వైనం పట్టణంలో కలకలం రేపింది. యువకుడి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలంటూ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు స్థానిక ఏరియా ఆస్పత్రి, పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఇందుకు సంబంధించి మృతుడి తల్లి లక్ష్మి, పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరాలిలా ఉన్నాయి.**



రామిశెట్టి భాస్కరరావు (ఫైల్ ఫొటో)



పోలీసుస్టేషన్ ముందు ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

నర్సీపట్నం మునిసిపాలిటీ ఐదో వార్డు పాతసంతబయలుకు చెందిన రామిశెట్టి భాస్కరరావు (34) పార్శిల్ సర్వీస్‌లో కలాసీగా పని చేస్తున్నాడు. కొంతకాలం క్రితం తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం గంటలు దాటిన తర్వాత పాతసంతబయలుకు చెందిన వీధిలో ఉంటున్న మడ్డు దొరబాబు, చీడిగుమ్మల గ్రామానికి చెందిన శ్రీను, మరొక యువకుడు భాస్కరరావు ఇంటికి వచ్చి, అతడిని బయటకు తీసుకువెళ్లారు. కానీ రాత్రయినా భాస్కరరావు ఇంటికి రాలేదు. మరుసటి రోజు కూడా ఆచూకీ లభించకపోవడంతో 10వ తేదీన తల్లి లక్ష్మి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడిని ఇంటి నుంచి బయటకు తీసుకు వెళ్లిన దొరబాబుని అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కోటవురట్ల రూట్లో పెదబొడ్డేపల్లి- జోగినాథునిపాలెం మధ్యలో కల్వర్టులో భాస్కరరావు మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఆస్పత్రి, పీఎస్‌ల వద్ద ఆందోళన

భాస్కరరావు బంధువులు, స్నేహితులతోపాటు పాత సంతబయలుకు చెందిన పలువురు శుక్రవారం ఉదయం పెద్ద ఎత్తున ఏరియా ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. భాస్కరరావును ఇంటి నుంచి బయటకు తీసుకు వెళ్లిన ఆ ముగ్గురే అతని మృతి కారణమని ఆరోపించారు. ఈ సంఘటనపై విచారణ చేసి మృతుడి తల్లికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గోవిందరావు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. విచారణ పక్కాగా చేస్తామని, ఎటువంటి సందేహాలు పెట్టుకోవద్దని భరోసా ఇచ్చారు. కాగా పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకువచ్చి ఆందోళనకు దిగారు. భాస్కరరావును బయటకు తీసుకువెళ్లిన ముగ్గురు వ్యక్తులు తమ అదుపులో ఉన్నారని, నిష్పక్షపాతంగా విచారణ చేస్తామని సీఐ వారికి చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు. సీఐ గోవిందరావు మాట్లాడుతూ, సీసీ ఫుటేజీలను పరిశీలించగా 8వ తేదీ రాత్రి 10.22 గంటలకు ... మిగతా 8వ పేజీలో

హైవే విస్తరణతో అభివృద్ధి

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

- 16వ నంబరు జాతీయ రహదారి విస్తరణ డీపీఆర్‌పై అధికారులతో సమావేశం



అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణతో పారిశ్రామిక, వాణిజ్య, రవాణా రంగాల్లో జిల్లా అభివృద్ధి చెందుతుందని, ఉపాధికి అవకాశాలు పెరుగు తాయని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు. అనకాపల్లి నుంచి రాజమహేంద్ర వరం సమీపంలోని దివాన్ చెరువు వరకు 16వ నంబరు జాతీయ రహదారి ఆరు లేన్లకు విస్తరణ డీపీఆర్‌పై శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ఈ రహదారి అనకాపల్లి జిల్లా పరిధిలో 68.64 కిలోమీటర్లు ఉంటుందన్నారు. అనకాపల్లి 'డైట్' కళాశాల వద్ద ప్రారంభమై, దివాన్‌చెరువు దాటిన తరువాత ముగుస్తుందని చెప్పారు. సత్వరమే టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి, పనులు ప్రాంభించాలని అధికారులకు సూచించారు. అనకాపల్లి, ఎలమంచిలి రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, బయ్యవరం వద్ద గూడ్స్‌షెడ్ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రాజుపాలెం, అనకాపల్లి ప్రాంతాల్లో ఆర్‌ఓబీ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నర్సింగబిల్లి, ఎలమంచిలి, బయ్యవరం, రేగుపాలెం ప్రాంతాల్లో ఆర్‌యూబీల డీపీఆర్‌లు తయారీ దశలో ఉన్నాయని, త్వరలో రైల్వే బోర్డుకు సమర్పించనున్నట్టు చెప్పారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు-భవనాలు, పంచాయతీ రాజ్, రైల్వే శాఖలు సమన్వయంతో పనిచేసి రైల్వేకు సంబంధించి తమ పరిధిలో ఉన్న సమస్యలను గుర్తించి నివేదికలు పంపాలన్నారు. సాంకేతిక నిపుణుల సూచనలను డీపీఆర్‌లో వుండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్‌హెచ్ఏఐ రాజమహేంద్రవరం ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్‌కుమార్ ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్‌కుమార్, పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం

గునుపూడి, గుమ్మిడిగొండ, తాండవ రోడ్లపై అడుగడుగునా గోతులు

- ఇబ్బందికరంగా మారిన ప్రయాణం
- గోతులు పూడ్చాలని పలు గ్రామాల ప్రజల వినతి

నాతవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలో పలు రహదారులు ఛిద్రం అయ్యాయి. ప్రధానంగా గునుపూడి, గుమ్మిడిగొండ ఆర్అండ్‌బీ రహదారులు, నాతవరం-తాండవ రహదారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం నీరు నిలిచిపోయి రాకపోకలకు ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గునుపూడి రోడ్డులో కార్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఉషశ్రీ ఇటీవల గునుపూడి వెళ్లి అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును పరిశీలించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా గోతులను కప్పించాలని స్థానిక టీడీపీ నాయకులు కోరారు. కాగా మూడు మండలాలకు చెందిన 16 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే ... మిగతా 8వ పేజీలో



పూర్తిగా ఛిద్రమై గోతులు ఏర్పడిన తాండవ-నాతవరం రోడ్డు

వైబీ పట్నంలో దారుణం

మద్యం మత్తులో తల్లిదండ్రులపై దాడి చేసిన కొడుకు

- భయంతో బయటకు పారిపోయిన తండ్రి
- పూలకుండీతో తలపై కొట్టడంతో తల్లి అక్కడికక్కడే మృతి



నిందితుడు రామ్మూర్తినాయుడు (ఫైల్ ఫొటో)



మంగ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ భీమరాజు

నాతవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): **మద్యానికి బానిసైన ఓ ప్రబుద్ధుడు.. నవమాసాలు మోసి కని, పెంచి పెద్ద చేసిన తల్లినే హత్యచేశాడు. నాతవరం మండలం వైబీ పట్నంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.**

వైబీపట్నం గ్రామానికి చందిన చిటికెల జోగినాయుడు, మంగ (55) దంపతులకు కుమారుడు రామ్మూర్తినాయుడు, కుమార్తె మాధురి ఉన్నారు కుమార్తెకు గతంలోనే వివాహం చేశారు. కొడుకు మద్యానికి బానిసై ... మిగతా 8వ పేజీలో

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే 'సుందరపు'



జడ్పీ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మారిన కాలానుగుణంగా విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. రూ.18.5లక్షల పీఎంశ్రీ నిధులతో ఇక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు క్రీడా ప్రాంగణాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కంప్యూటర్ లేకుండా ఏ పని చేయలేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల విద్యార్థి దశనుంచే కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలని సూచించారు. క్రీడల్లో రాణించిన వారికి కూడా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అంతకు ముందు రామన్నపాలెంలో ఎగ్ కార్ట్ షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, రాజాన సన్యాసి నాయుడు, డి.బాపూజీ, జనపరెడ్డి నర్సింగరావు, డ్రీమ్స్ నాయుడు, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ సీహెచ్.తాతారావు, హెచ్‌ఎం పద్మావతి, పుర్రే శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యంతో ముందుకు సాగితే సత్ఫలితాలు'



పీజీ సెట్‌లో మంచి ర్యాంకులు సాధించి సత్కారం పొందిన వారితో అధ్యాపకులు

ఎలమంచిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 'ఇన్‌స్పైర్- 2025'లో ఆయన మాట్లాడారు. విద్యార్థినీ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో ఉన్నతంగా రాణించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఈ ఏడాది పీజీ సెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన 38 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించి, ఏకలవ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నగదు బహుమతులు అందజేశారు. ఈ ర్యాంకులు సాధించిన కళాశాల ఫిజిక్స్ విభాగానికి ద్రోణాచార్య అవార్డు ప్రదానం చేసినట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫిజిక్స్ విభాగంలో ఏడో ర్యాంకు సాధించడంలో సహకారం అందించిన ఎస్.కృష్ణవేణి తల్లిదండ్రులకు ఆదినారాయణ మెమోరియల్ అవార్డును అందజేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేఖా రామారావు, అధ్యాపకులు డాక్టర్ అర్జున అప్పారావు, అకడమిక్ సెల్ అధ్యక్షుడు పి.జగ్గారావు తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పెదవి విప్పని సభ్యులు.. పెత్తనం చూపిన 'సూపర్లు'!

▸ అచ్యుతాపురం మండల సమావేశంలో మళ్లీ ఇదే తంతు ▸ ప్రతిసారీ పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు తోడుగా వచ్చిన వారిదే హడావుడి

▸ వారించలేకపోతున్న అధికారులు ▸ అసలు సమస్యలు ప్రస్తావనకు రావడం లేదని కొందరి వ్యాఖ్య





మండల సమావేశానికి హాజరైన సభ్యులు, సూపర్‌లు.. వేదికపై ఎంపీపీ, ఎంపీడీవో, జడ్పీటీసీ తదితరులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కార వేదికైన అచ్యుతాపురం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులైన వారిలో కొంత మంది మౌనవ్రతం పాటిస్తుండగా, వారికి తోడుగా వచ్చే (సూపర్‌లు) గళమెత్తుతుండడం పరిపాటిగా మారింది. తాజాగా శుక్రవారం జరిగిన సమావేశంలోనూ ఇదే దృశ్యం ఆవిష్కృతమైంది. సమావేశం నిర్వాహకులు సైతం వారికి అడ్డు చెప్పకపోవడంతో చేసేది లేక అధికారులు వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన ఉదయం సమావేశం ప్రారంభమైంది. తొలుత మండల వ్యవసాయాధికారి శంకర్ గోవింద్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం, నాట్లు వేసిన తీరు, ఎరువులు, విత్తనాల పంపిణీ గురించి వివరిస్తుండగా, వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు అడ్డు తగిలారు. ఆ వివరాలన్నీ ఇప్పుడు ఎందుకంటూనే.. వ్యవసాయానికి సంబంధించిన సందేహాలు ఉంటే అడగాలని సభ్యులను కోరారు. జంగులూరు సర్పంచ్ కె.సత్యారావు (వైసీపీ) మాట్లాడుతూ ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరవాడ నుంచి యూరియాను అధిక ధరలకు కొనుగోలు చేసుకున్నారన్నారు. దీనికి గుళికలు కొంటే కానీ యూరియా ఇవ్వబోమని వ్యాపారులు మెలిక పెట్టడంతో తప్పనిసరి స్థితిలో కొనాల్సి వచ్చిందని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అసలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తొలి విడత యూరియా పంపిణీ చేశామని, రెండో విడత రావలసి ఉందని ఏవో చెపుతున్నా వైసీపీకి చెందిన కొందరు సూపర్‌లు (సభ్యులు కానివారు) గళమెత్తి నిలదీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మాట్లాడుతుండగా, పూడిమడక ఎంపీటీసీ-3 సభ్యురాలు మేరుగు అరుణ భర్త లేచి పూడిమడకకు తాగునీరు రావడం లేదని, మూడు రోజులకు ఒకసారి ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. ఈయన సభ్యుడు కానప్పటికీ వేదికపై ఉన్న వారు వారించలేని దుస్థితిలో ఉండడంతో సదరు అధికారి సమాధానం చెప్పాల్సి వచ్చింది. ఎంఈవో దేవరాయలు మాట్లాడుతూ మండలంలో ఏడు పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, అవి మరమ్మతులకు కూడా పనికి రావని తెలిపారు. వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని ప్రతిపాదించినట్టు చెప్పారు. మధ్యలో కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఇప్పుడు విద్యార్థుల సంఖ్య ఎంతని ప్రశ్నించారు. కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారు కూడా ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారన్నారు. అచ్యుతాపురంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున తమ గ్రామం మీదుగా తాత్కాలిక రోడ్డు వేశారని, ఈ విషయమై తమకు కనీస సమాచారం తెలియజేయలేదని మడుతూరు ఎంపీటీసీ శనివాడ జువ్వాల నాయుడు వాపోయారు. భారీ వాహనాల రాకపోకలు జరుగుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే అడ్డుకట్ట వేయాలని కోరారు. రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లపై అవగాహన కల్పించాలని జడ్పీటీసీ సభ్యుడు కోరారు. మండలంలో 12 మంది ఎంపీటీసీలు, 19 మంది సర్పంచ్ మహిళా సభ్యులు ఉన్నారు. వీరితో పాటు వీరి భర్తలు కూడా సమావేశానికి హాజరైనా అధికారులు వారించలేకపోవడం చర్చకు దారితీసింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సుందరపు హాజరు కాలేదు. జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశాలకు వెళ్లాల్సి ఉండడంతో రాలేకపోయారని ఆయన వర్గీయుల ద్వారా తెలిసింది. ఆయన వచ్చి ఉంటే సభ సజావుగా, నిబంధనలకు అనుగుణంగా జరిగి ఉండేదన్న చర్చ జరిగింది. ఎంపీడీవో చిన్నారావు, తహశీల్దార్ సత్యనారాయణతో పాటు సర్పంచులు, ఎంపీటీసీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగు నీటి కాలువల్లో శ్రమదానం

మునగపాక, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రధాన సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన తుప్పలు, చెత్తాచెదారాన్ని శుక్రవారం ములబందగోడి రైతులు శ్రమదానంతో తొలగించారు. నీటి ప్రవాహం సజావుగా సాగకపోవడంతో పొలాలు నీటి ముంపునకు గువుతున్నాయన్నారు. ఇది గుర్తించి ఈ పనులు చేపట్టినట్టు రైతు సంఘం నాయకులు దొడ్డి నూకరాజు, సూరిశెట్టి దుర్గునాయుడు, దాడి శివ తదితరులు తెలిపారు.

15న భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఆందోళన

రాంబిల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న తలపెట్టిన 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చందక రామకృష్ణ కోరారు. శుక్రవారం వెల్చూరు, పెదకలవలాపల్లి గ్రామాల్లో ఇందుకు సంబంధించి ప్రచారం నిర్వహించారు.

రోజంతా ముసురుతో జనం అవస్థలు



ఎలమంచిలి పట్టణంలో చిరుజల్లులు కురుస్తున్న దృశ్యం

ఎలమంచిలి/రాంబిల్లి/అచ్యుతాపురం/మునగపాక, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా శుక్రవారం నియోజక వర్గంలోని ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లో ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జల్లులు పడుతూనే ఉండడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులతో పాటు వివిధ పనులపై బయటకు వచ్చేవారంతా చిత్తడి వాతావరణంతో అసౌకర్యానికి గురయ్యారు. రహదారులు బురదమయంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు మరీ దారుణంగా ఉన్నాయి. పంట పొలాలు, కాలువలు, చెరువుల్లో నీరు చేరడంతో జలకళను సంతరించుకుంటున్నాయి. పొలాల్లో పలువురు రైతులు నాట్లు వేస్తున్నారు. వర్షం కారణంగా సముద్రంలో చేపల వేటకు వెళ్లలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొటున్నామని రాంబిల్లి మండలంలోని తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

'రాష్ట్రంలో పౌర సరఫరాల వ్యవస్థ ప్రక్షాళన'

మునగపాక, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో పౌర సరఫరాల వ్యవస్థను కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం పలువురికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. గత వైసీపీ పాలనలో నిర్వీర్యమైన సంస్థల్లో పౌర సరఫరాల వ్యవస్థ ఒకటని పేర్కొన్నారు. క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ కార్డులను రాష్ట్రమంతటా పంపిణీ జరుగుతోందన్నారు. అదే విధంగా అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేస్తున్నామని చెప్పారు. ఇది నిరంతర ప్రకియగా వివరించారు. తహశీల్దార్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, గవర, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు భీమరశెట్టి శ్రీని వాసరావు, డొక్కా నాగభూషణం, సహకార సంఘం చైర్ పర్సన్ యల్లపు వెంకట భాస్కరరావు, కూటమి నాయకులు దొడ్డి శ్రీను, టెక్కలి పరశురాం, పెంటకోట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేగుపాలెం పాఠశాల సమీపంలో బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న సంస్థ సభ్యులు

ఎలమంచిలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : రేగుపాలెంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన చేతి బోరును శుక్రవారం ప్రారంభించారు. నాసా స్వచ్ఛంద సంస్థ, షీబా న్యూలైఫ్ చిల్డ్రన్స్ హోమ్ సంయుక్తంగా దీనిని ఏర్పాటు చేశారు. ఇది పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అనపర్తి రాజు తదితరులు తెలిపారు.

టిడ్కో గృహ సముదాయంలో తాగునీటి సమస్య పరిష్కారం

ఎలమంచిలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో గల ఇన్‌ఫిల్టర్ బావిలో పాడైన మోటార్లకు మునిసిపల్ అధికారులు మరమ్మతులు చేయించారు. మోటార్లు పాడైన విషయాన్ని మునిసిపల్ కమిషనర్ ప్రసాద రాజు, ఏఈ గణపతి సుబ్బారావు దృష్టికి తీసుకు వెళ్లడంతో వారు వెంటనే స్పందించినట్టు కాలనీ ప్రతినిధి బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం నుంచి యథాతథంగా నీరు వస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా వారికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

▸ ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటపతిరాజు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

నక్కపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటపతిరాజు డిమాండ్ చేశారు. ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నక్కపల్లి మండలంలో ఆయన పర్యటించారు. పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలంటూ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తహసీల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు, సంఘ ప్రతినిధులు విజయశ్రీ, ఫాల్గుణరావు, నరసింహమూర్తి, రంగబాబు, బి.లక్ష్మణరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో...



తహశీల్దార్‌కు వినతపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్‌నాయకులు

కోటవురట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు తిరుమలబాబుకు వినతపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సంగీతరాజ్, లోవరాజు, నాయకులు ఎం.కృష్ణప్రసాద్, వాసు, సాంబ, జీవన్‌రావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబిడి శ్యామసుందరం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ జె.రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఐఆర్ ప్రకటించడంతో పాటు అన్ని బకాయిలను ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జి.సునీల్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు వానపల్లి శ్రీను, మండల కౌన్సిలర్ అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పాండురంగ స్వామి వారి దేవస్థానము

దేవదాయ ధర్మాదాయ శాఖ, పాయకరావుపేట, అనకాపల్లి జిల్లా

టెండరు కమ్ బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మండలం మరియు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పాండురంగస్వామి వారి దేవస్థానము యొక్క హక్కుభుక్తములోయున్న కళ్యాణ మండపము లీజుకు ఇచ్చుటకు **తేది 18-09-2025 గురువారం ఉదయం 11 గంటలకు** బహిరంగ వేలం పాట పై దేవస్థానం కార్యాలయం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో జరుపబడును.

వ.నెం.	వివరములు	ప్రథమ ధరావత్తు	గడువు కాలము
1.	కళ్యాణమండపము	1,00,000	01.10.2025 నుండి 30.09.2027 వరకు (2సంవత్సరముల కాలపరిమితి)

ఈ వేలం పాటలో పాల్గొనదలిచిన వారు తప్పనిసరిగా తమ యొక్క ఆధార్ కార్డుతో హాజరు కావలెను. పై వేలంపాటకు సంబంధించిన షరతులు మరియు సమాచారం గురించి కార్యాలయం నందు సంప్రదించవలెను - ఫోన్ నెం. **79898 67804**

పాయకరావుపేట
తేది:12-09-2025

ఇట్లు
కార్యనిర్వాహణాధికారిణి

'మన మిత్ర'తో ప్రజలకు సేవలు అందించాలి

▸ నర్సీపట్నం డీఎల్‌డీవో నాగలక్ష్మి



మన మిత్ర యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీవో నాగలక్ష్మి

కోటవురట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మన మిత్ర యాప్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించాలని నర్సీపట్నం డీఎల్‌డీవో నాగలక్ష్మి సూచించారు. మండలంలోని యండపల్లి గ్రామంలో చెత్త సేకరణపై శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ చేస్తున్నారా? లేదా? అని ఆమె విచారించారు. అనంతరం డీఎల్‌డీవో మాట్లాడుతూ మన మిత్ర యాప్ ద్వారా 161 ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం మన మిత్రవాట్సాప్ గవర్నన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు కాలువలు పరిశుభ్రం చేయించాలని సూచించారు. అనంతరం సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా వర్మీకంపోస్టు చేసి పంచాయతీకి ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని డీఎల్‌డీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కోటవురట్ల పంచాయతీ కార్యదర్శి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డక్కన్ ఫైన్ కెమికల్స్ పరిశ్రమలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తునికి చెందిన మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహణలో మదర్ బ్లడ్ బ్యాంక్, వైఎస్ఆర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని పరిశ్రమ టెక్నికల్ డైరెక్టర్ కేవీఎల్‌పీ.రాజు, వైస్ ప్రెసిడెంట్ వీఎస్‌ఎస్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న పిల్లల అవసరం దృష్ట్యా మూడేళ్లుగా కంపెనీలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏటా రెండుసార్లు తలసేమియా పిల్లలకు రక్తం ఇచ్చి ఆదుకుంటున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 200 మంది ఉద్యోగులు రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో వర్షం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి సుమారు మూడు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. కొన్ని చోట్ల రహదారులపై ఏర్పడిన గోతులన్నీ వర్షపు నీరుతో నిండిపోయాయి. దీంతో ఆ మార్గాల్లో రాకపోకలు చేసిన వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సీతారం ఏచూరికి ఘన నివాళి

నక్కపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేట గ్రామంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత నేత ఏచూరి సీతారం ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, మహేశ్, కాశీరావు వివరించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సీతారం పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో కోడా కాశీ, నూకరాజు, వై.అప్పారావు, కాశీ, వీర్రాజు, రమణ, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

250 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు జలాశయం నుంచి శుక్రవారం 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలో వర్షాలకు వరదనీరు భారీగా వచ్చి చేరింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, శుక్రవారం నాటికి 330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.2 మీటర్లకు చేరింది. దీంతోమూడో గేటు తెరిచి పెద్దేరు నదిలోకి 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు ఘన సత్కారం



ఉద్యోగోన్నతి పొందిన ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, కార్యాలయ ఏవో రవికుమార్‌వర్మను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

పాయకరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల ఉద్యోగోన్నతి పొంది బదిలీ అయిన ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, కార్యాలయ ఏవోలు సిహెచ్.రవికుమార్ వర్మలను అధికారులు ఘనంగా సత్కరించారు. పాయకరావుపేట ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎ.జయప్రకాశరావుకు డీడీవోగా ప్రమోషన్ వచ్చి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు బదిలీ కాగా, ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సిహెచ్.రవికుమార్‌వర్మకు ఎంపీడీవోగా ప్రమోషన్ ఇచ్చి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో వారిని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కోటనందూరు ఎంపీడీవో పి.వెంకటనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో కె.డేవిడ్, పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకోండి

▸ డక్కన్ ఫైన్ కెమికల్స్ లిమిటెడ్ డైరెక్టర్ కేవీఎల్‌పీ.రాజు



మాట్లాడుతున్న డైరెక్టర్ కేవీఎల్‌పీ.రాజు

పాయకరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్య నేర్చుకుని ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని డక్కన్ ఫైన్ కెమికల్స్ లిమిటెడ్ డైరెక్టర్ కేవీఎల్‌పీ.రాజు తెలిపారు. శుక్రవారం పాయకరావుపేటలోని ప్రభుత్వ ఐటీఐకి కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.3 లక్షలు విలువచేసే యూపీఎస్ బ్యాటరీలు, హెచ్‌పీ జెట్ ప్రింటర్, డ్రిల్లింగ్ మెషిన్, పవర్ కటింగ్ మెషిన్ తదితర యంత్ర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేవీఎల్‌పీ.రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తాము నేర్చుకున్న ట్రేడ్‌లో మంచి నైపుణ్యం పెంపొందించుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ ఐటీఐకి తమ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీడీ ఆర్‌వీ.రమణ, కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, జిల్లా శిక్షణాధికారిణి ఎం.లతాదేవి, అప్రెంటీస్ అడ్వయిజర్ యూఎస్‌ఎన్.మూర్తి, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం జి.రామారావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి ఈ ఏడాది నవంబరులో జరిగే సత్యసాయి జన్మదిన వేడుకల్లో బంగారు పతకాన్ని అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.వెంకన్న, ఎం.సుధాకర్, రాజు కుమందస్, గోవిందరావు, లక్ష్మీనారాయణ, రవికుమార్, సంస్థ ప్రతినిధి కృష్ణంరాజు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌కు బదిలీ

నక్కపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి సీహెచ్‌సీలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ శిరీషాకు బదిలీ జరిగింది. కొన్నాళ్లుగా 50 పడకల ఆస్పత్రిలో సేవలు అందిస్తున్న ఆమెను ఎలమంచిలి ఆస్పత్రికి బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో సీతారామరాజు, డాక్టర్ ఈశ్వరప్రసాద్, డాక్టర్ రవికిరణ్, టీడీపీ నాయకుడు వెంకటేశ్ తదితరులు ఆమెను సత్కరించారు. అంతకుముందు ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో సీతారామరాజు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్ పలు సూచనలు చేశారు. రోగులు సంతృప్తి చెందేలా సేవలను విస్తృతపర్చాలని, మంత్రి అనిత ఈ ఆస్పత్రి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు.

భక్తుల దుర్గాభవానీ మాలధారణ

నక్కపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వందల సంఖ్యలో అమ్మవారి భక్తులు దుర్గాభవానీ దీక్షలు చేపట్టారు. అర్ధ మండల దీక్షలు చేపట్టే భక్తులంతా గురుభవానీల సమక్షంలో శుక్రవారం మాలాధారణ చేశారు. గత వారం రోజుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దీక్షలు చేపడుతున్నారు. శుక్రవారం ఉపమాక శివాలయంలో గురుభవానీలు డి.రాంబాబు, మైలపల్లి శ్రీను, నానాజీ, అప్పలరాజు తదితరులు దీక్షాపరులకు మాలాధారణ చేశారు. వీరంతా గ్రామాల్లో అమ్మవారి పీఠాలు పెట్టి సామూహికంగా పూజలు, భజనలు చేస్తారు. అనంతరం శరన్నవరాత్రి ఉత్సవాలకు విజయవాడ వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు.

ఆత్మ రక్షణ విద్యపై విద్యార్థినులకు శిక్షణ

ఎస్.రాయవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు ఆత్మ రక్షణ కోసం శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థినుల్లో ధైర్యం నింపే విధంగా పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ధర్మవరం అగ్రహారం, తిమ్మాపురం, ఎస్‌రాయవరం, వమ్మవరం పాఠశాలలకు చెందిన బాలికలకు చందు తైక్వాండో అకాడమీకి చెందిన పలువురు శిక్షకుల సమక్షంలో నిర్వహించిన ఈ తరగతుల్లో సెల్ఫ్ డిఫెన్స్‌కు సంబంధించి విద్యార్థినులకు పలు మెలకువలపై శిక్షణ ఇచ్చారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

▸▸ సబ్బవరం మండల సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశం

▸▸ ఉపాధి పనుల నిర్వహణపై సభ్యులు అసంతృప్తి ▸▸ గ్రావెల్ రోడ్లకు తీర్మానాలు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం


మండల సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబా

సబ్బవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అధికారుల్లో జవాబుదారీతనం ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కారించిన తరువాతే వచ్చే సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. మొక్కుబడిగా సమావేశాలకు రావద్దని హితవు పలికారు. ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభమైతే పలువురు అధికారులు పదకొండ గంటలకు రావడం పట్ల ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె శాఖలవారీగా సమీక్ష జరిపారు. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రశ్నలు సంధించారు. అభివృద్ధి పనులకు అవసరమైన గ్రావెల్, మట్టి లభ్యతపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. గర్భిణులకు టీటీ ఇంజక్షన్లు ఇటీవల వేయడం లేదని ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి ఆరోపించారు. వైద్య సిబ్బంది సర్వే చేసి ఈ ఇంజక్షన్లు ఇస్తారని, ఎక్కడైనా ఇవ్వకపోతే తన దృష్టికి తేవాలని వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి సూచించారు. మునగ సాగుపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఏపీవో వసంతకుమార్ తెలిపారు. మట్టి రోడ్లు, గ్రావెల్ రోడ్లకు తీర్మానాలు చేసి ఏడాది నుంచి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకూ పట్టించుకోలేదని వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, పైడివాడ ఎంపీటీసీ శీరం అప్పలరాజు, సబ్బవరం-4 ఎంపీటీసీ చైతన్య, బాటజంగాలపాలెం సర్పంచ్ పడాల శ్రీను, సబ్బవరం-3 ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, అమృతపురం ఎంపీటీసీ సింగంపల్లి శ్రీను ప్రశ్నించారు. పనుల నిర్వహణ పట్ల ఉపాధి హామీ పథకం అధికారులకు అవగాహన లేదని, కనీసం తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదని వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి రోడ్లు తప్ప, గ్రావెల్ రోడ్లు వేసేందుకు తమకు అధికారం లేదని ఎంపీడీవో పి.పద్మజ సభ్యులకు వివరించారు. తహశీల్దార్ అనుమతులు ఉంటే తప్ప గ్రావెల్ తరలించడం వీలు కాదని ఉపాధి పథకం అధికారులు తెలపగా, తహశీల్దార్ అనమతులు ఇవ్వాలని సభ్యులు కోరారు. గ్రావెల్ ఇచ్చే అధికారం తనకు లేదని, మైనింగ్ అధికారులకు మాత్రమే ఉందని తహశీల్దార్ వివరించారు. మండలంలో అభివృద్ధి పనులకు అవసరమైన గ్రావెల్ కోసం తీర్మానం చేసి ఉన్నతాధికారులుకు పంపాలని పలువురు ప్రజా ప్రతినిధులు సభకు సూచించారు.

అసకపల్లిలో నాలుగు కల్వర్టులు ఉపాధి పథకంలో నిర్మించాల్సి ఉండగా, రెండేళ్ల నుంచి పనులు జరగలేదని సర్పంచ్ కర్రి నర్సింగరావు పేర్కొన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలించుకు పోతున్నా పట్టించుకోలేదని ఆ గ్రామ ఎంపీటీసీ కర్రి అప్పారావు ఆరోపించారు. గత ప్రభుత్వంలో పలు గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే కొంత మంది అడ్డుకొని కోర్టుకు వెళ్లా రని, అవన్నీ పరిశీలించి ఇప్పుడు వారందరికీ కొత్తగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువు సభ్యులు కోరారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటికే రైతులకు 70 శాతంపైగా ఎరువులు పంపిణీ చేశామని, కొంత స్టాకు ఉందని వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ వివరించారు. మరి కొంత వర్షం తగ్గిన తరువాత వస్తుందని తెలిపారు. బాటజంగాలపాలెంలో ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా భూములు సర్వే జరుగుతుందని, గ్రామ అవసరాలకు కొంత భూమిని కేటాయించాలని సర్పంచ్ పడాల వెంకటరమణ కోరారు. మరి కొంత మంది సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, మామిడి లక్ష్మిలతో పాటు ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలకు దారేది..?


పశువైద్యశాల ప్రధాన రోడ్డులో...

▸▸ కశింకోటలో పాడి పశువులను వైద్య సేవలకు తెచ్చేందుకు రైతులకు ఇబ్బందులు

▸▸ రోజుల తరబడి ఆస్పత్రి ప్రాంగణంలో మురుగు తిష్ట ▸▸ పట్టించుకోని అధికారులు


పశు వైద్యశాల ప్రాంగణంలో చెరువును తలపిస్తున్న మురుగు

కశింకోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కశింకోట జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పశు వైద్యశాల ప్రాంగణంలో మురుగు తిష్ఠ వేసింది. దీంతో పాడి రైతులు వైద్యశాలకు వెళ్లి వచ్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఆసుపత్రి వెనుక ఇళ్లలో నివాసం ఉంటున్నవారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గ్రామ పురవీధుల్లోని వాడుక నీరు, వర్షపు నీరు ఆసుపత్రికి వెళ్లే ప్రధాన మార్గంలో నిలిచిపోతోంది. రోజుల తరబడి అది ఉండిపోతుండడంతో నాచు పట్టి కనిపిస్తోంది. దీంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో అంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మురుగు కారణంగా పశువులను వైద్య శాలకు తీసుకు వెళ్లాలంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల నుంచి వైద్యుల అనుమతితో వెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. ఇటువంటి సమయంలో పీహెచ్‌సీకి వచ్చే రోగులు పశువులు తమకు ఎక్కడ ఏం చేస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ కాలువలు అరకొరగా నిర్మాణం చేయడంతో పాటు వాటి నిర్వహణ పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఆసుపత్రి వెనుక వైపు నివాస గృహాల ప్రజలు మురుగు నీటి నుంచి వెళ్లి వస్తూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

చక్కని బోధనతో సత్ఫలితాలు

▸▸ జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావు నాయుడు


వంగలి పాఠశాలలో నోట్ పుస్తకాలు తనిఖీ చేస్తున్న డీఈవో

సబ్బవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన విద్యా బోధనతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. మండలంలోని వంగలిలో గల ప్రాథమికోన్నత పాఠశాల, గాలిభీమవరం శివారు జాగారపువానిపాలెం ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. చక్కగా చదువుకుని అంతా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థుల నోట్ పుస్తకాలు, డైరీలు, టైం టేబుల్, అసైన్మెంట్ పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబులతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవరాత్రి వేడుకలకు పెదముషిడివాడలో రాటోత్సవం


రామాలయం వద్ద రాటోత్సవంలో పాల్గొన్న భక్తులు

లంకెలపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ రామాలయం వద్ద దుర్గాభవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శుక్రవారం ముహూర్తపు రాట వేశారు. తొలుత వేదపండితులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి అక్టోబరు రెండో తేదీ దసరా వరకు ఉత్సవాలను అంత్యంత ఘనంగా జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పల్లా అప్పారావు, యలమర్తి బుజ్జి, కలవలపల్లి సత్యనారాయణ, బొండా అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సింహాద్రి' మొదటి యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో ఉత్పత్తికి శుక్రవారం అంతరాయం ఏర్పడింది. ఇదే యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. ఇదిలావుంటే మిగతా రెండు, మూడు, నాలుగు యూనిట్‌లలో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

'స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని వినతి'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్‌కార్డులు, ఈ-పోస్ యంత్రాలను తక్షణమే పంపిణీ చేయాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ కోరారు. స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ మేరకు సీఎం కార్యాలయానికి, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967కు ఫిర్యాదులు చేసినట్టు శుక్రవారం ఆయన ఇక్కడి విలేకరులకు వివరించారు. జిల్లాలోని 24 మండలాలు ఉండగా నర్సీపట్నం, మాడుగుల మండలాల్లో శుక్రవారం క్యూఆర్ కోడ్ స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ మొక్కుబడిగా ప్రారంభం కాగా, మిగిలిన మండలాల్లో నేటికీ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. దీనిపై తక్షణమే స్పందించాల్సిందిగా ఆయన కోరారు.

స్టాపర్లను ఢీకొట్టిన కారు

▸▸ నలుగురికి గాయాలు... ఇద్దరి పరిస్థితి విషయం

▸▸ అచ్యుతాపురం నుంచి వస్తుండగా శీలానగర్-కాన్వెంట్ జంక్షన్ రహదారిలో ప్రమాదం


సిమెంట్ స్టాపర్లను ఢీకొట్టడంతో నుజ్జయిన కారు

మల్కాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో అడ్డుగా ఉంచిన సిమెంటు స్టాపర్లను ఓ కారు ఢీకొట్టడంతో అందులోని నలుగురు ప్రయాణికులు గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం మారుతి సర్కిల్ వద్ద శుక్రవారం జరిగింది. వివరాలాలా ఉన్నాయి. నగరంలోని సీతంపేటకు చెందిన శ్రీజర్ ఉషా శ్రీదేవి (64), ఏలేశ్వరం వెంకట రత్నపాప (70), రాజు, సీతామహాలక్ష్మిలకు అచ్యుతాపురంలో ఓ కంపెనీ ఉంది. అక్కడ పూజలు చేసేందుకు శుక్రవారం ఉదయం నగరం నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్‌కు వస్తుండగా మారుతి సర్కిల్ సమీపంలో వాహనం రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో అడ్డుగా ఉంచిన స్టాపర్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురూ గాయపడ్డారు. వారిలో శ్రీజర్ ఉషా శ్రీదేవి (64), ఏలేశ్వరం వెంకట రత్నపాప (70)లను షీలానగర్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. క్షతగాత్రుల్లో మరో ఇద్దరు రాజు, సీతామహాలక్ష్మిలను కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు ఆటో డ్రైవర్లు పాలాభిషేకం

▸▸ 'వాహన మిత్ర' ప్రకటనపై ఆనందం

▸▸ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు : ఎమ్మెల్యే


చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

సబ్బవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగకు వాహన మిత్ర పథ కంలో భాగంగా ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు అందజేయనున్నట్టు ప్రభుత్వ ప్రకటించడంతో ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం యూనియన్ నేతలు, ఆటో డ్రైవర్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్ర పటా లకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం అన్ని వర్గాలకు మేలు చేస్తుంద న్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితిని తెలుసుకున్న సీఎం, డిప్యూటీ సీఎం కేబినెట్‌లో చర్చించి వాహన మిత్ర పథకం ప్రకటించడం హర్షణీయమన్నారు. అంతకు ముందు పౌర సరఫరాలశాఖ నూతనంగా జారీ చేసిన స్మార్టు కార్డులను పలువురికి ఎమ్మెల్యే పంచకర్ల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, తహశీల్దార్ చిన్నికృష్ణ, వైస్ ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, మామిడి లక్ష్మి, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పాక శేషు, సాలాపు వెంకటేశ్వ రరావు, బైలపూడి దేముడుబాబు, కర్రి కనకరాజు, దొడ్డి ప్రకాశ్, స్వామి నాయుడు, కర్రి కనకరాజు, కొండాజీ, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు శాస్త్రీయమైన సమాచార సేకరణ


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

▸▸ ఐఆర్‌ఏడీపై పోలీస్ సిబ్బంది శిక్షణలో డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సబ్ డివిజన్ పరిధిలో గల పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శుక్రవారం ఇక్కడి రాంకీ కమర్షియల్ హబ్‌లో ఇంటిగ్రేడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటా బేస్ (ఐఆర్‌ఏడీ) పై శిక్షన కార్యక్రమం నిర్వహించారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రహదారి భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో ఐఆర్‌ఏడీ పనిచేస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, నియంత్రణలో శాస్త్రీయమైన సమాచార సేకరణ కీలకమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ముఖ్యంగా డేటా ఎంట్రీ, కేసుల రిజిస్ట్రేషన్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం డేటా ఎంట్రీ, కేసుల రిజిస్ట్రేషన్, రోడ్డు ప్రమాదాల వివరాల నమోదు తదితర అంశాలపై సగ్రంగా శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ బి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

జనసైనికుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న కనకరాజు, తదితరులు

సబ్బవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అసకపల్లి గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త చింతల బంగారునాయుడు ఇటీవల ప్రమాదంలో మృతి చెందడంతో పార్టీ సభ్యత్వం ఉన్న అతనికి సంబంధించిన రూ. ఐదు లక్షల బీమా చెక్కును శుక్రవారం గ్రామ సర్పంచ్ కర్రి నర్సింగరావు, పార్టీ కన్వీనర్ కర్రి కనకరాజు ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చింతల శ్రీను, అప్పలరాజు, పల్లి మంగరాజు, ఏనుగుల సత్తిబాబు, కరణం పండు, కర్రి శివ, రాము, వాసు, సాయి, రమేశ్, ఈశ్వర తదితరలు పాల్గొన్నారు.

ఉగ్గినపాలెంలో యూరియా పంపిణీ


రైతుకు యూరియా బస్తాను అందిస్తున్న కూటమి నాయకులు

కశింకోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గినపాలెం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం యూరియా పంపిణీ చేపట్టారు. కూటమి నాయకులు కలగ సోమేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, రమణ, గోవింద తదితరులు రైతులకు అవసరమైన యూరియా బస్తాలను అందజేశారు. యూరియా, విత్తనాల పంపిణీలో ఎటువంటి సమస్యలున్నా తక్షణమే అధికారులకు సంప్రదించాలన్నారు. కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని సూచించారు.

ఏ పొలం చూసినా సందడే

▸▸ పల్లెల్లో ముమ్మరంగా వరి నాట్లు ▸▸ బిజీబిజీగా అన్నదాతలు


పరవాడలో వరి నాట్లు వేస్తున్న రైతులు


వరి నాట్లు వేసిన దృశ్యం

పరవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులంతా పొలాల్లో బిజీగా గడుపుతున్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. వరి పంటకు అవసరమైన నీరు పుష్కలంగా ఉండడంతో అన్నదాతలు ఖరీఫ్ వరి పంటపై దృష్టి పెట్టారు. మండల వ్యాప్తంగా సుమారు 139 హెక్టార్లల్లో ఖరీఫ్ వరినాట్లు వేసేందుకు మడులను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటి వరకు 132 హెక్టార్లల్లో నాట్లు పూర్తయినట్టు మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎంఎస్ మూర్తి తెలిపారు. మిగతా చోట్ల కూడా ఈ నెలలో నాట్లు పూర్తి చేస్తారన్నారు. ఇప్పటి వరకు రావాడ, కలపాక, స్వయంభూవరం, తానాంలలో వరినాట్లు పూర్తయ్యాయి. ఆయా గ్రామాల్లో నీటి సౌకర్యం పుష్కలంగా ఉండడంతో వరి పంటకు ఈ ఏడాది ఢోకా ఉండదని అంతా ధీమాగా ఉన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

▸▸ జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహణ

▸▸ సుమారు 30 కంపెనీలు ఇంటర్వ్యూలు

▸▸ 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గలవారు అర్హులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహణకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు 30 కంపెనీలు ఇంటర్వ్యూల నిర్వహణకు వస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ వరకు చదువుకొని 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు అర్హులుగా పేర్కొన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యేటప్పుడు బయోడేటా, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని సూచించారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా డైట్ కళాశాల విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందించిన చైర్మన్ రత్నాకర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా డైట్ కళాశాల విద్యార్థిని ఎంపికయ్యారు. సీఎస్ఎం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషన్ లెర్నింగ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎస్.గీతాంజలి ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపికైనట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాల అధిపతులు ఆమెను అభినందించారు.

పరవాడలో మోస్తరు వర్షం

పరవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా పరవాడ పరిసర మండలాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. ఈ వర్షం కారణంగా మూల స్వయంభూవరం, గొల్లగుంట, వెంకటాపురం, కొల్లివానిపాలెం గ్రామాలకు వెళ్లే రహదారులు చిత్తడిగా మారాయి. రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రేషన్ డిపో తరలించాలని వినతి

సబ్బవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో గత కొన్నేళ్లుగా పాత పంచాయతీ కార్యాలయ భవనంలో నడుపుతున్న రేషన్ డిపోను తరలించాలని ఆదే గ్రామానికి చెందిన ఉగ్గిన రాము తహశీల్దార్ బి.చిన్నికృష్ణను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులు లేకుండా నడుపుతున్న రేషన్ డిపోపై గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదని ఆరోపించారు.అక్కడి నుంచి డిపోను తరలించే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయాలు ప్రారంభం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యం కోసం వీఎంఆర్‌డీఏ అనకాపల్లి, విజయనగరం జిల్లా కేంద్రాల్లో నిర్మించిన జోనల్ కార్యాలయాలను వర్చువల్ విధానంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ శుక్రవారం ప్రారంభించారు. విజయనగరంలో భవన పునర్నిర్మాణానికి రూ.47.95 లక్షలు, అనకాపల్లిలో రూ.33.5 లక్షలు ఖర్చు చేశామన్నారు. వీటిలో వీఎంఆర్‌డీఏ అధికారులు పూర్తి స్థాయి సేవలు అందిస్తారన్నారు. సెక్రటరీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

150 గ్రామాల్లో తాగునీటి పథకాలకు ప్రతిపాదనలు

» ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కరుణ

చింతపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో డీఏ జుగా (ధర్తీ అబ జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్) పథకం ద్వారా 150 గ్రా మాల్లో రూ. 4.8 కోట్లతో తాగు నీటి పథకాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిం చినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జి.కరుణ తెలిపారు. శుక్రవారం సబ్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులతో స్థానికంగా ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇ స్తోందన్నారు. జల్ జీవన్ మిషన్ (జేజేఎం)లో సబ్ డివిజన్ పరిధి కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి మండలాలకు 1,082 మంచి నీటి పథకాలు మంజూరయ్యాయన్నారు. 728 పథకాల నిర్మాణాలు పూర్తి చేసి ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశామన్నారు. 180 తాగునీటి పథకాలు నిర్మాణ దశలో, 174 టెండర్ దశలోనూ ఉన్నట్టు ఆమె పేర్కొన్నారు. జల్‌జీవన్ మిషన్ మంచి నీటి పథకాలను వేగవంతం చేస్తున్నామన్నా రు. జేజేఎంలో తాగునీటి పథకాలు కేటాయించని గ్రామాలకు డీఏ జుగాలో ప్రతిపాదనలు పంపించినట్టు ఆమె వివరించారు. నిధులు విడుదల కాగానే నిర్మాణాలు చేపడతామన్నారు. పీఎం జన్‌మన్ పథకంలో సబ్ డివిజన్‌కి పది తాగు నీటి పథకాలు ని ర్మాణానికి రూ.70లక్షల మంజూరయ్యాయన్నారు. చింతపల్లి మండలం బలపం పంచాయతీ జువ్వివీధిలో నీటి పథకం నిర్మాణం జరిగిందని, మరో తొమ్మిది పథకాలు టెండర్ దశలో ఉన్నాయన్నారు. ప్రధానంగా వ్యాధుల సీజన్ కావడంతో రక్షిత నీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయడతోపాటూ శుభ్రం చేయిస్తున్నామన్నారు. తాగునీటిని ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్నామన్నారు. గ్రా మాల్లో రక్షిత పథకాల నిర్వహణకు ఎంఎల్‌హెచ్‌పీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఫీల్డ్ టెస్టింగ్ కిట్లు అందజేస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధి మంచి నీటి పథకాలకు ఉచితంగా పరీక్షలు చేస్తున్నామన్నారు. ప్రై వేటు, ఇతర ప్రభుత్వశాఖ మంచి నీటి పరీక్షలకు రూ.1,600 రుసుం ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి ఏఈఈలు గడుతూరి స్వర్ణలత, వి. కల్యాణ్‌రామ్ పాల్గొన్నారు.


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న డీఈఈ కరుణ

కాఫీకి బెర్రీ బోరర్ కీటకంపై అప్రమత్తం కావాలి

» ఎస్ఎల్‌వో శ్రీరమణ

కొయ్యూరు/గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాఫీ బెర్రీ బోరర్ కీటకంపై రైతులు అప్రమత్తం కావాలని చింతపల్లి కేంద్ర కాఫీ బోర్డు సీనియర్ లైజనింగ్ అధికారి శ్రీరమణ అన్నారు. శుక్రవారం కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని గరిమండ, వంతమర్రి, బూదరాళ్ల జీకేవీధి మండలం తీములబంద గ్రామాల్లో ఆదివాసీ రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీనియర్ లైజనింగ్ అధికారి మాట్లాడుతూ కాఫీ బెర్రీ బోరర్ కాయల్లో చొరబడి గింజలను ఆహారంగా తీసుకుంటూ సొరంగా ఏర్పాటు చేసుకుంటుందన్నారు. ఇందులో గుడ్లు పెడుతుందన్నారు. ఈ కీటకంతో కాఫీ కాయలు, పండ్లు పూర్తిన నాశనమైపోతాయన్నారు. పంట దిగుబడి తగ్గి రైతులు భారీగా నష్టపోతారన్నారు. కాయలు, పండ్లలో నల్లని రంధ్రాలు ఉంటే తమకు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో జేఎల్‌వోలు రవి కుమార్, ప్రదీప్, నాగేశ్వరావు, విస్తరణ ఇన్‌స్పెక్టర్ శశి ప్రియ పాల్గొన్నారు.

జి.మాడుగుల: బెర్రి బోరర్ కీటకంను సంరక్షణ చర్యలతో నివారించవచ్చునని కర్ణాటకకు చెందిన కాఫీ శాస్త్రవేత్త ప్రభుగౌడ కామరెడ్డి (ఎస్ఎల్‌వో) రైతులకు సూచించారు. మండలంలోని ఆయన ఆధ్వర్యంలో బృందం శుక్రవారం మండలంలోని 17 పంచాయతీల్లో సందర్శించింది. కాఫీ రైతులకు అవగాహన కల్పించారు. కాఫీ తోటల్లో బెర్రి బోరర్ కీటకం నిరోధకంపై జాగ్రత్తలపై వివరించారు. ఈ కీటకంపై అన్ని పంచాయతీలో సర్వేలు నిర్వహించారు. అధికారులు సుదిశ్, స్రవంతి, జగదీశ్, పాత్రుడు, సీతారాం మజ్జి, కాఫీ సిబ్బంది వెంకట్, మోహన్, బాబూరావు పాల్గొన్నారు.


బూదరాళ్లలో తోటలను పరిశీలిస్తున్న కాఫీ బోర్డు అధికారులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న కర్ణాటకకు చెందిన అధికారులు

అన్‌సీజన్‌లో పనస

చింతపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చౌడుపల్లి పంచాయతీ కేంద్రం లోని అభ్యుదయ రైతుల పెరట్లో పనస చెట్టుకు అన్ సీజన్‌లో పనస కాయలు కాశాయి. దీంతో వీటిని చూడడానికి జనాలు క్యూ కడుతున్నారు. అభ్యుదయ రైతు కంటా రమణ నాలుగేళ్ల క్రితం పెరట్లో పనస మొక్కను నాటారు. ఏడాదికే ఈ మొక్క కాపునకు వచ్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి జూలై వరకు పనస కాయలు చెట్లకు కాస్తాయి. ప్రస్తుతం భిన్నంగా ఈ పనస చెట్టు అడుగు భాగంలో రెండు పనస కాయలు కాసింది. మరో వారం రోజుల్లో ఈ కాయలు పండి కోతదశకు వస్తాయి.


చౌడుపల్లిలోని రైతు రమణ పెరట్లో చెట్టుకి కాసిన పనస కాయలు

బీటీ రోడ్డు లేక అవస్థలు వర్ణనాతీతం


బురదమయమైనరోడ్డుపై నిరసన తెలుపుతున్న గొచ్చారి గ్రామస్థులు

పెదబయలు, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి బీటీ రోడ్డు మం జూరు చేయాలని మండలం పెదకోడపల్లి పంచాయతీ గొచ్చారి గ్రామస్థులు, ఆదివాసీ మహాసభ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లే మార్గంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహాసభ సభ్యుడు భీముడు మాట్లాడుతూ గొచ్చారి గ్రామంలో 30 పీవీటీజీ కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. సరైన రహదారి సౌకర్యం లేక గ్రామస్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఎవరికైనా అనారోగ్య పరిస్థితిల్లో అంబులెన్స్ కూడా రాదన్నారు. డోలీ ద్వారానే ఆస్పత్రికి తరలిస్తున్నారని చెప్పారు. వర్షాకాలంలో చిత్తడిగా మారి ద్విచక్రవాహనం కూడా వెళ్లని విధంగా బురదగా మారిందని వాపోయారు. పాలకులు అధికారులు స్పందించి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు, కేటేశ్వరరావు, భాస్కర్‌రవు, సన్యాసిరావు, మల్లేశ్, ప్రసాద్, బాబ్జీ, రామన్న తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


నగదు అందిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగూడ పంచాయతీ గూడమాలిపుట్టుకు చెందిన వైసీపీ సీనియర్ నేత బుడియా మాణిక్యం (61)అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణలు శుక్రవారం జరిగిన ఆయన అంత్యక్రియలకు హాజరయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అధైరపడొద్దని అన్నివిధాలుగా ఆదుకుంటామని వారి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వారికి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాణిక్యం మృతి పార్టీకి లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎం.బాబూరావు, వి.రమేశ్, ఎస్.నర్సింగరావు, వైసీపీ మండల అధ్యక్షుడు పి.పద్మారావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లి మూర్తి, దివ్యాంగుల సంఘ జిల్లా అధ్యక్షులు కె.జయదేవ్, జేసీఎస్ కో-ఆర్డినేటర్ అరబీరు జగబంధు పాల్గొన్నారు.

జీకే వీధికి 20 టన్నుల యూరియా


యూరియా, డీఏపీ అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలానికి 20టన్నుల యూ రియా, ఐదు టన్నుల డీఏపీ వచ్చినట్టు స్థానిక మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు అన్నారు. శుక్రవారం ఏవో మాట్లాడుతూ మండల ప్రజలకు ఎరువుల కొరతలేదన్నారు. ప్రస్తుతం వచ్చిన యూరియాలను ధారకొండ రైతు సేవా కేంద్రానికి మూడు టన్నులు, రింతాడకు ఐదు టన్నులు, దుప్పులవాడకు ఆరు టన్నులు, గుమ్మిరేవులకు ఆరు టన్నులు కేటాయిస్తున్నామన్నారు. డీఏపీ ఐదు టన్నులు రింతాడకు పంపిస్తున్నామన్నారు. సోమవారం నాటికి మరో 20టన్నుల యూరియా వస్తుందన్నారు. వీఏఏ వసుపరి సౌందర్య, రింతాడ ఉప సర్పంచ్ సోమేశ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చింతపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ వెంకట రమణ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు సీఐ ఎం. వినోద్ బాబు పర్యవేక్షణలో ఎస్ఐ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రికార్డులేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. సీబుక్, ఇన్సూరెన్సు, పొల్యూషన్ కచ్చితంగా ఉండాలన్నారు.

అట్టహాసంగా అరకు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన చైర్‌పర్సన్, డైరెక్టర్లతో దొన్నుదొర, నాయకులు

అరకులోయ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అరకు మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు ఇన్‌చార్జి దొన్ను దొర అతిథిగా పాల్గొన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బొరి బొరి లక్ష్మితో తొలుత ఏఎంసీ కార్యదర్శి జగన్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వైస్ చైర్మన్‌గా కమిడి జాన్‌ప్రకాశ్‌తోపాటు 14 మంది సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ టీడీపీని నమ్ముకున్న వారికి అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఏఎంసీ పాలకవర్గం రైతులకు మేలు చేకూరేలా పనిచేయాలన్నారు. చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ తనను చైర్‌పర్సన్‌గా ప్రభుత్వానికి తర పేరును ప్రతిపాదించిన దొన్నుదొరకు ఎప్పటికి రుణపడి ఉంటానన్నారు. అందరి సమన్వయం చేసుకుంటూ సేవలందిస్తానన్నారు. టీడీ పీ నాయకులు శెట్టిలక్ష్మణుడు, లకోయ్ మహదేవ్, సర్పంచ్‌లు దాసుబాబు, శ్రీనివాసరావు, బూర్జ లక్ష్మి తదితరులు నూతన పాలక వర్గ సభ్యులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

గంజాయి జోలికి వెళ్లొద్దు: సీఐ


యువతతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

కొయ్యూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉం డాలని కొయ్యూరు సీఐ బి. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలో చీడిపాలెం గ్రామాన్ని సీఐతో పాటు ఎస్ఐ కిశోర్‌వర్మ సందర్శించారు. గ్రామస్థులు, యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూనాటుసారా, గంజాయి, రవాణా, రహదారి భద్రత, సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత గంజాయి రవాణాకు దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిగా జగదీశ్



కొయ్యూరు, సెప్టెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా జగదీశ్ నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 9వ తేదీన ఈ పీహెచ్‌సీకు వైద్యాధికారిణిగా స్నేహలత రెడ్డి చేశారు. ఇప్పుడు రెండవ వైద్యాధికారిని నియమించటంతో ఈ ప్రాంతీయులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

గెడ్డలు దాటి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు: ఎస్ఐ


ఎస్ఐ శ్రీనివాసరావు

అనంతగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి, పినకోట, పెదకోట, కివర్ల, లంగుపర్తి, భీంపోల్, గుమ్మకోట, చిలకలగెడ్డ పంచాయతీల పరిధిలో ప్రజలు గెడ్డల వద్ద అప్రమత్తంగా ఉండాలని స్థానిన ఎస్ఐ డి.శ్రీనివాసరావు హెచ్చరించారు. భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఈనేపథ్యంలో గెడ్డలో దిగి వరద నీటి ప్రవాహానికి గిరిజనులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ఇళ్లకే పరిమితం కావాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగితే పోలీస్‌శాఖకు సమాచారం అందించాలని కోరారు.

సామాజిక భవనానికి మరమ్మతులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ.3.5 లక్షల నిధులతో సామాజిక భవనం మరమ్మతులు, సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు స్థానిక ఎంపీడీవో ఇమ్మానుయేలు తెలిపారు. శుక్రవారంసీసీరోడ్డు, సామాజిక భవనం మరమ్మతులకు ఎంపీడీవో, ఎస్ఐ సురేశ్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కోఆప్టెడ్ సభ్యుడు ఎస్కే. దావీదు, సర్పంచ్ సుభద్ర సంయుక్తంగా సమీకరించిన నిధులతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి మజీద్, ఎంపీటీసీ సభ్యులు రాజులమ్మ, సత్యనారాయణ, జనసేన నాయకుడు గొర్లె వీరవెంకట్, గ్రామ పెద్దలు అరుణ్, బాబి పాల్గొన్నారు.

పశు వైద్య సేవలు విస్తరణ: కలెక్టర్


జాతీయ పశువ్యాధి నివారణ పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పాడేరురూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నివారణ పథకం (ఎన్ఏడీసీపీ)పోస్టర్‌ను శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ దినేశ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పశువుల్లో వ్యాధుల నివారణ, పాడి ఉత్పత్తి పెంపు, రైతుల ఆదాయం వృద్ధి లక్ష్యమన్నారు. గిరిజన ప్రాం తంలో పశు వైద్య సేవలనువిస్తరించనున్నాయన్నారు. పశు వైద్యాధికారులున్నారు.

'పోడు సాగును ప్రోత్సహించం'


తోకరాయి ఫారెస్టు సెక్షన్ అధికారి సతీశ్

సీలేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోడు వ్యవసాయం చట్టరీత్యా నేరమని, ఇ లావాటిని అటవీశాఖ అధికారులు ఎప్పుడు ప్రోత్సహించలేదని జీకేవీధి మండలం లోని సీలేరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని తోకరాయి అటవీశాఖ సెక్షన్ అధికారి సతీశ్ అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో పోడు వ్యవసాయంతో తీవ్ర నష్టం' శీర్షికన వె లువడిన కథనంపై ఆయన మాట్లాడారు. తోకరాయి గ్రామస్థులు తమ గ్రామ సరిహద్దుల్లో ఉన్న అటవీ భూముల్లో చోడిరాయి వాసులు పోడు వ్యవసాయం చేయడాన్ని అటవీశాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నట్టు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. 2005కు ముందు నుంచి పోడు వ్యవసాయం చేసిన వారికి మాత్రమే పట్టాలు అంద జేశామని, ప్ర స్తుతం పర్యావరణ పరిరక్షణలో భాగంతో రిజర్వు ఫారెస్టులో ఎక్కడైనా చె ట్లు నరికినా, పోడు చేసినా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సచివాలయం, పీహెచ్‌సీల తనిఖీ


డౌనూరు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొయ్యూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డౌనూరు గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో బాల మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివా లయంలో రికార్డులు పరిశీలించారు. సిబ్బంది హాజరును పర్యవేక్షించారు. తాగునీటి వనరుల క్లోరినేషన్ విధిగా చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి వైద్యాధికారితో జ్వరాల తీవ్రత, మందుల నిల్వలపై ఆరా తీశారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ నాయుడు కార్యదర్శి రేష్మా, పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

డుంబ్రిగుడ: కితలంగి పంచాయతీ రంగిసింగ్‌గుడలో మండల ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో-2 గెన్ను శుక్రవారం ఆకస్మిక తనిఖీని చేపట్టారు. విద్యార్థులను చిన్న చిన్న పదాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

15 నుంచి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

అనంతగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈనెల 15 తేదీ నుంచి అక్టోబర్ 15 తేదీ వరకు ముందస్తుగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు ప్రణాళిలను రుపొందించామని కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు తెలిపారు. మండలంలోని 22వేలు పశువులు, 500 గేదలకు గాలికుంటు, డెక్కజడుపు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

యూ-విన్ టీకాల కార్యక్రమ పోర్టల్ ఆవిష్కరణ


ప్రపంచ టీకాల పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీఎంహెచ్‌వో తదితరులు

పాడేరురూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో యూ-విన్ ప్రపంచ పోర్టల్ ఆన్‌లైన్ టీకాల నవీకరణ పోస్టర్‌ను శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి టీఎస్ ప్రతాప్, డీసీహెచ్‌వో డాక్టర్. నీలవేణి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీఎంహెచ్‌వో ప్రతాప్ మాట్లాడుతూ గర్భిణులు, శిశువులు, పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా యూ-విన్ కార్యక్రమం ద్వారా ఆన్‌లైన్ టీకాల నవీకరణ జరుగుతుందన్నారు. ప్రతీ కుటుంబానికి సరైన సమయంలో టీకాలు అందించేలా టీకాల సమాచారాన్ని డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఆన్‌లైన్ నవీకరణ ద్వారా సకాలంలో టీకాలు అందించేందుకు, తల్లిదండ్రులకు వీటిపై అవగాహన కల్పిస్తామన్నారు. టీకాల కవరేజీని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు, దూర ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలకు కూడా సేవలను అందించగల సామర్థ్యం, వ్యాధుల నివారణకు సకాలంలో చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు ఇందులో పాల్గొని పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక అధికారిణి డాక్టర్.కె. కమల కుమారి, జిల్లా యూ-విన్ కో- ఆర్డినేటర్ ప్రసన్న దత్త, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను తెరిపించరూ..


పేట్రాయి జీయూపీ పాఠశాల ఎదుట చిన్నారులు

సీలేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాడుబడిన పాఠశాల ఎదుట ఇలా వరుసగా చిన్నారులు నిల్చున్న దృశ్యం జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి మారుమూల పేట్రాయి గ్రామంలోనిది. ఇక్కడి జీయూపీ పాఠశాలలో 40 మంది చిన్నారులు చదువుతున్నారు. వీరికి బోధించేందుకు ఒక్క ఉపాధ్యాయుడు లేరు. ఈ పాఠశాలకు గత జూన్‌లో పునఃప్రారంభం నుంచి కూడా ఉపాధ్యాయుడు లేకపోవడంతో పాఠశాల తెరచుకోలేదు. ఎన్నిసార్లు విద్యాశాఖాధికారులను తమ గ్రామంలో ఉపాధ్యాయుడి నియమించాలని కోరినా అదిగో, ఇదిగో కాలక్షేపం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఉపాధ్యాయులు లేకున్నా వలంటీర్లను అయినా నియమించి చిన్నారులకు విద్యాబుద్ధులు చెప్పేవారని, ప్రస్తుతం అటువంటి చర్యలు ఏమీ చేపట్టడంలేదని వాపోతున్నారు. దీంతో తమ పిల్లలు భవిష్యత్తు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులుఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

నేపాల్ బాధితుల రక్షణలో మంత్రి లోకేశ్ కృషి భేష్

» విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర


మాట్లాడుతున్న దొన్నుదొర, పక్కన టీడీపీ నాయకులు

అరకులోయ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేపాల్ మరణహోమంలో చిక్కుకున్న తెలుగువారిని స్వస్థలాలకు తరలించడంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన కృషి ప్రశంసనీయమని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్, టీడీపీ అరకు ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక తన నివాసంలో పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నేపాల్‌లో కష్టాల్లో ఉన్న తెలుగువారిని లోకేశ్ మానవతా దృక్పథంతో ప్రత్యేక విమానాలతో స్వస్థలాలకు రప్పించారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్‌ను ఏర్పాటుచేసి అన్ని విధాల సహాయక చర్యలు చేపట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లూ ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు నేపాల్‌లో ఉన్న తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేందుకు ప్రత్యేక చొరవ చూపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారి పట్ల మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ అరకులోయ మండల టీడీపీ అధ్యక్షుడు లకోయ్‌మహదేవ్, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, డుంబ్రిగుడ పార్టీ అధ్యక్షుడు ఆనంద్, వైస్‌సర్పంచ్ చందా విజయనిర్మల, హుకుంపేట నేత కేడెల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలు, పాఠశాలల్లో సమస్యలపై వినతి


ఐటీడీఏ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జీఎస్‌యూ నేతలు

పాడేరురూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం (జీఎస్‌యూ) శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే మీ కోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్‌కు అందించింది. ఈసందర్భంగా జీఎస్‌యూ నేత బుడిదే మాధవరావు, కిరసాని కిశోర్ మాట్లాడుతూ, అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 260 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. అక్కడ వారికి వసతి గృహ సౌకర్యం లేక ప్రైవేటు గదులలో అద్దెకు ఉంటున్నారన్నారు. పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ ననభరీ పీవీటీజీలో 30 మంది చిన్నారులకు ఉపాధ్యాయుడు, పాఠశాల భవనం లేదన్నారు. ఓ ప్రైవేటు సంస్థ (లయ) వార వలంటీర్‌ను ఏర్పాటు చేసి చిన్నారులకుబోధన అందిస్తున్నారన్నారు. . ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు ఎం. బాబూజీ, బి.అనీల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ నిరసన

పాడేరురూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పై ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమీషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ. శ్యాంసుందర్, కె.పోతురాజు, ఎంకైలాసం, ఎల్‌వీ దొర, బి.సోంబాబు, ఎస్.రామ్మూర్తి, పి.బాబూరావు, ఎం.కొండబాబు, జి.కన్నారావు, జె.మనోజ్, కె.రాంబాబు, కె.వెంకటేశ్వర్లు, కె.బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. శ్యామ్‌సుందరం, మండల శాఖ అధ్యక్షుడు జె. మాలంనాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ త్రినాథరావునాయుడుకు వినతి పత్రాన్ని అందించారు. సభ్యులు డీటీ రంగారావు, ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, గణపతి, వైకుంఠం, సత్యంపడాల్, దామోధరం, కంద్రన్న, సాధూరాం తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు


రోడ్డును మరమ్మతులు చేపడుతున్న కోదువలస గ్రామస్థులు

పెదబయలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలంలోని లక్ష్మీపేట పంచాయతీ కోదువలస గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. ఏటా వర్షాకాలంలో గిరిజనులకు రవాణా కష్టాలు త ప్పటం లేదు. ఈ నేపథ్యంలో పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణ సామాగ్రి తరలించేందుకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో గ్రామస్థులు సమావేశం నిర్వహించుకున్నారు. శ్రమదానంతో రోడ్డు బాగు చేసుకోవాలని నిర్ణయించారు. ఈమేరకుశుక్రవారం గ్రామంలో అందరూ సమష్టిగా మండిబ కూడలి నుండి కోదువలస గ్రామం వరకు రోడ్డును బాగు చేసుకున్నారు. గుంతలు పూడ్చి, జంగిల్ క్లియర్ చే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి మధ్యలోనే పనులు నిలిపేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోదువలసకు పక్కా రోడ్డును నిర్మించాలని కోరారు.

పెదబయలులో రోడ్డు విస్తరణ పనులు

పెదబయలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణకు శుక్రవారం తహశీల్దార్ త్రినాథరావునాయుడు ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు. ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. ఇరువైపులా 25 అడుగుల మేర విస్తరించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణయ్య, వీఆర్వో చరణ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే బండారు

క్రీడా మైదానం ప్రారంభం

మాడుగుల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా మైదానాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ మైదానంలోని రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులను ప్రారంభించిన అనంతరం, కొంతసేపు విద్యార్థులతో షటిల్ ఆడారు. కాగా, ఎమ్మెల్యే ప్రారంభానికి హడావిడిగా తయారు చేసిన కోర్టు మైదానం కొద్ది పాటి వర్షానికి బురదమయంగా మారడంతో కాంట్రాక్టర్‌పై పలువురు మండిపడ్డారు. అనంతరం పంచాయతీరాజ్ అతిథి గృహంలో నియోజక వర్గంలోని అన్ని మండలాల సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ నాయకులు పి.లక్ష్మీనారాయణ, వి.బాబు పాల్గొన్నారు.

కొట్నాబిల్లిలో సెల్ టవర్ ఏర్పాటుచేయరూ..



సెల్ టవర్ ఏర్పాటు చేయాలని వేడుకుంటున్న గిరిజనులు

రావికమతం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్నాబిల్లిలో సెల్ టవర్ ఏర్పాటుచేసి నెట్‌వర్క్ సదుపాయం కల్పించాలి నాలుగు గ్రామాల గిరిజనులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వారంతా చేతులు జోడించి నమస్కరిస్తూ నిరసన తెలిపారు. అనంతరం గిరిజన సంఘం మహిళా అధ్యక్షురాలు పెండ్లి గౌరీ మాట్లాడుతూ కె.కొట్నాబిల్లి, పి.కొట్నాబిల్లి, రామన్నదొరపాలెం, గదబపాలెం గ్రామాల్లో 260 కుటుంబాలుకు చెందిన 800 మంది జనాభా నివసిస్తున్నారని చెప్పారు. మండల కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ఆయా గ్రామాలకు నెట్‌వర్క్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఎవరికి అనారోగ్యం చేసినా, గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినా కొండెక్కి అంబులెన్స్ కోసం ఫోన్ చేయాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వృద్ధులు, వింతంతువులు, వికలాంగులు పింఛన్లు పొందడానికి రేషన్ సరకులు తీసుకోవడానికి నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి కె.కొట్నాబిల్లిలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాడి బెన్నయ్య, తాడి అచ్చియ్యమ్మ, కె.గోవిందరావు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలయమం



దేవరాపల్లి ప్రధాన రహదారిపై కురుస్తున్న వర్షం

చోడవరం/మాడుగుల/మాడుగుల రూరల్/దేవరాపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ద్రోణి ప్రభావంతో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చోడవరంలో మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభమైంది. సాయంత్రం వరకూ మోస్తరు వాన పడుతూనే ఉంది. రోజంతా ముసురు వాతావరణం నెలకొని ఉండడం, వర్షం తగ్గకపోవడంతో వాతావరణం చిత్తడిగా మారిపోయింది. మాడుగుల కేంద్రంతో పాటు గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చెంది వాన పడింది. 11 గంటల వరకు వాతావరణం పొడిగానే ఉంది. అనంతరం తేలికపాటి వర్షం కురిసింది. దేవరాపల్లి మండలంలో మధ్యాహ్నం నుంచి వర్షం పడింది. సాయంత్రానికి భారీగా వర్షంతో పడడంతో పంట పొలాల్లో నీరు సమృద్ధిగా చేరింది. ఈ వర్షం సరుగుడు, కూరకాయల పంటలకు ఇది మేలు చేకూర్చుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

శిథిల వంతెనలను పరిశీలించిన డీఎస్పీ



కాజ్‌వేను పరిశీలిస్తున్న డీఎస్పీ

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట, వడ్డాదిలో శిథిలమైన వంతెనలను అనకాపల్లి డీఎస్పీ శ్రావణి శుక్రవారం పరిశీలించారు. విజయరామరాజుపేట కాజ్‌వేలో నీటి ప్రవాహన్ని పరిశీలించారు. నీటి ప్రవాహంలో దిగి రాకపోకలు సాగించవద్దని ప్రజలకు సూచించారు. అలాగే వడ్డాది వంతెనకు పడిన రంధ్రాన్ని పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు. వాహనాలు ప్రయాణించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసరావును ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది సంబరాలు

నర్సీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి కూటమి ప్రభుత్వం జీతాలు పెంచడంతో సంబరాలు చేసుకున్నారు. వారి జీతాలను రూ.15 వేలు నుంచి రూ.18,500కు ఒకే సారి రూ.3500 పెంచడంతో శుక్రవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలతో అభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మునిసిపల్ శాఖా మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వై.శేఖర్ పాల్గొన్నారు.

పొగాకు దుష్పరిణామాలపై అవగాహన ర్యాలీ



ప్రధాన మార్గంలో ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎం.కోడూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మద్యపానం, పొగాకు ఉత్పత్తుల దుష్పరిణామాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్లకార్డులతో గ్రామ వీధుల్లో తిరిగి మానవహారంగా ఏర్పడ్డారు. మద్యపానం, పొగాకు, గుట్కా వంటి అలవాట్ల వల్ల అనారోగ్యం బారిన పడరాదని, క్యాన్సర్ రోగాలకు గురి కాకూడదని నినాదాలు చేశారు. వీటివల్ల అనర్థాలు సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కనకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శక సేవలకే రేషన్ స్మార్ట్ కార్డులు

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు పారదర్శకంగా రేషన్ సరకులు పంపిణీ చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. వీరనారాయణం గ్రామంలో శుక్రవారం స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి పేదలకు పూర్తిగా న్యాయం చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ముందడుగు వేశారన్నారు. ఈ కార్డులను గ్రామ సచివాలయం ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్డుల ద్వారా ఎటువంటి అవకతవకలు జరగకుండా నేరుగా లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు అందజేస్తారన్నారు. అలాగే ఏ డిపోలోనైనా స్మార్ట్ కార్డు స్కాన్ చేసి రేషన్ సరకులు పొందవచ్చునన్నారు. అంతేకాకుండా ప్రతీ రేషన్ డిపో ద్వారా నెలలో 25 రోజుల పాటు సరకులు ఇచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పేరుతో లక్షలాది రూపాయలతో వాహనాలు కొనుగోలు నిధులు వృథా చేసిందన్నారు. ఇంటింటికీ సరకులు ఇవ్వకుండా రోడ్డుపైన, వీధి శివారులోవాహనాలు పెట్టి లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను రేషన్ డీలర్ల సంఘం సభ్యులు సత్కరించి జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సర్పంచ్ కొండప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు నూకరత్నం, టీడీపీ నాయకులు సన్యాసిరావు, పుప్పాల రమేశ్, వి.వరహాల నాయుడు, అచ్యుతరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు లేవా?

మండల సమావేశంలో సభ్యుల నిలదీత

రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్న వ్యవసాయ శాఖ అధికారులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

గొలుగొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో లేవా అని సభ్యులు నిలదీశారు. అయితే రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందబాటులో ఉన్నాయని వ్యసాయాధికారులు వివరణ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారులు ఎరువుల గురించి వివరిస్తుండగా పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ అడ్డుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు యూరియా అందుబాటులోకి తీసుకురాలేదని నిలదీశారు. ఎరువులు అందించకపోతే వరి, జీడిమామిడికి పంటలు సాగు చేస్తున్న రైతులు ఇబ్బందులు పడతారన్నారు. ప్రస్తుతం అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారులు వివరించారు. అలాగే గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, దీనిపై పర్యవేక్షణ చేపట్టాలని గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు కోరారు. గొలుగొండలో జల్ జీవన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. వైద్యాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా నియంత్రణకు త్వరలో అన్ని గ్రామాల్లో దోమతెరలు పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో తాగునీటి పథకాలు క్లోరినేషన్ చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఎంపీపీ మణికుమారి మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బాబూరావు, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి... అధికారులను ప్రశ్నిస్తున్న వేములపూడి ఎంపీటీసీ ప్రసాద్

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం జరిగింది. రోలుగుంట పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాట్లాడుతూ క్యాన్సర్ ముందుగా గుర్తించడానికి ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నట్టు చెప్పారు. కరోనా ఇంజక్షన్లవ వల్ల గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు వస్తున్నట్టు వస్తున్న అపోహలపై వివరణ ఇవ్వాలని జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ అడిగారు. అటువంటిది ఏమీ కాదని వైద్యాధికారిణి వివరణ ఇచ్చారు. ఓఎల్.పురంలో ఆశా పోస్టును భర్తీ చేయాలని సర్పంచ్ నాగరాజు కోరారు. రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి కోరారు. వేములపూడి ఎంపీటీసీ-1 బోళెం రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేటు డీలర్లు యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వాటిని నియంత్రించాలని ఏవోను కోరారు. గురందొరపాలెం గ్రామ సర్పంచ్ శానాపతి వెంకటరత్నం తమ గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో అధికారులు తెలపాలని కోరారు. ఆరు వారాల నుంచి ఉపాధి సొమ్ము పడలేదని, దీనిపై చర్యలు చేపట్టాలని అమలాపురం సర్పంచ్ శెట్టి శ్రీను కోరారు. ఆర్టీసీ బస్సుల్లో జీడిపప్పు తీసుకువెళ్తున్నారని, మార్కెట్ యార్డు చెస్ట్ కట్టేందుకు ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే బలిఘట్టంలోని హైస్కూలులో నాడు-నేడు పనులు సరిగ్గా జరగడం లేదని, దీనిపై ఎంఈవో విచారణ చేయాలని నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ కోరారు. గ్రామాల్లో కోతులతో పాటు కుక్కల బెడద అధికంగా ఉందని, దీనిపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకంతో మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్టు జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ పేర్కొన్నారు. అలాగే పలు శాఖల అధికారుల పని తీరుపై ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో యు.రమాకుమారి, వ్యవసాయాధికారి బీహెచ్‌వీ.రమణబాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయం నుంచి 250 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయం నుంచి శుక్రవారం 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భారీ వర్షాలకు జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, శుక్రవారం నాటికి 330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.2 మీటర్లకు చేరింది. దీంతో మూడో గేటు తెరిచి పెద్దేరు నదిలోకి 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

మంత్రి నారా లోకేశ్ నిర్ణయం హర్షణీయం

దేవరాపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న తెలుగు వారికి ఇక్కడికి రప్పించడానికి విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న నిర్ణయం హర్షదాయకమని మాడుగుల నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిం నాగేశ్వరరావు అన్నారు. అనంతపురం పర్యటను సైతం రద్దు చేసుకుని నేరుగా కంట్రోల్ సెంటర్‌ను గదిగా పర్యవేక్షించడం జరిగిందన్నారు. నేపాల్ నుంచి క్షేమంగా ఇక్కడకు చేరుకొనేలా చేసిన నారా లోకేశ్‌కు వారంతా రుణపడి ఉంటారన్నారు.

15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

రోలుగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకే ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని తహసీల్దార్ నాగమ్మ పేర్కొన్నారు. శుక్రవారం రేషన్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలానికి 15995 స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని, 15వ తేదీ నుంచి పంపిణీ చేయడానికి సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అనంతరం డిపోల వారీగా వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను డీలర్లకు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివ, ఆర్ఐ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్ల తొలగింపు సరికాదు

రావికమతం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీటి పన్ను చెల్లించలేదని కుళాయిల కనెక్షన్ తొలగించడం నిబంధనలు విరుద్ధమని ఎంపీడీవో సీతారామస్వామి స్పష్టం చేశారు. నీటి పన్ను చెల్లించలేదని వంద ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లను ఈవో జ్యోతిశ్వరెడ్డి ఆదేశాలతో సిబ్బంది గురువారం కట్ చేశారు. దీనిపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కుళాయి కనెక్షన్లను పునరుద్ధరించాలని చెప్పారు. నీటిని విడుదల చేసే సిబ్బందికి పంచాయతీ నుంచి వేతనం చెల్లించలేని పక్షంలో నీటి పన్ను వసూలు చేయవచ్చునని నిబంధనలు ఉన్నాయన్నారు. పారిశుధ్య సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ చెత్తను ఎందుకు సంపద కేంద్రానికి తరలించలేదని ఈవోను ఆయన ప్రశ్నించారు.

ప్రజా ప్రతినిధుల సమక్షంలోనే కార్డుల పంపిణీ

రావికమతం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధుల సమక్షంలోనే స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని తహశీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 22,246 స్మార్ట్ రేషన్ కార్డులు చేరుకున్నాయన్నారు. వీటిని డిపోలీ వారీగా వేరు చేసి అందజేస్తామన్నారు. డిపోకు కేటాయించినవి సచివాలయ ఉద్యోగులతో కలిసి డీలర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలన్నారు. ఈ విషయంలో లోపాలు తలెత్తకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీటీ జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమస్యలపై ఉపాధ్యాయుల ఆందోళనలు

▸▸ అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

చోడవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించి బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు ఆర్.చిరంజీవి, కె.మల్లేశ్వరరావు, గొల్లు శ్రీనువాసరావు, డోకల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: ఉపాధ్యాయుల సమస్యలపై తహశీల్దార్ రామారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.నూకరాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు పాత్రుడు, గోవింద్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ని.ద్ర.శ్రీరామూర్తి కోరారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయలను, ఉద్యోగులను చిన్నచూపు చూస్తే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని ఈ సందర్భగా ఆయన పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్ జి.వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మల్లేశ్, దొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాతవరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే నిరసన వారం కార్యక్రమం చేపట్టినట్టు ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. పెండింగ్ డీఏలను విడుదల చేయలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.సత్యనారాయణ, ఎస్‌సత్యనారాయణ, ఎస్.జగన్నాథరావు, అప్పన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అన్ని రకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ నాగమ్మకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు పి.రమణ, ప్రధాన కార్యదర్శి కె.అశోక్ సామ్రాట్, నాయకులు బి.రాము, ప్రభాకరరావు, పెంటారావు, రామశేషు పాల్గొన్నారు.

చీడికాడ: ఉపాధ్యాఉల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.పి.ఏ.నాయుడు, గౌరవ అధ్యక్షుడు లెక్కల ప్రసాద్ డిమాడ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ కిశోర్‌లింకన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

బుచ్చెయ్యపేట: మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వారంలో భాగంగా ఉపాధ్యాయులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు తమరాన త్రినాథ్, ఎస్.దుర్గాప్రసాద్, బి.శేషు, సిహెచ్.మధుకృష్ణ అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని నినాదాలు చేశారు.

రావికమతం: పెడింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు వజ్రపు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ అంబేడ్కర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల నాయకులు జి.సుధీర్‌కుమార్, లక్ష్మణరావు, బి.దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నియామకం

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

నాతవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌ను నియమించారు. ఈ పీహెచ్‌సీలో రెండున్నర నెలలుగా డాక్టర్లు లేకపోవడం, మందుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతుండడం తదితర సమస్యలపై 'బదిలీలు చేశారు.. నియామకాలు మరిచారు' అన్న శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు సప్పర్ల పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్‌ను నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా నియమిం చారు. దీంతో శుక్రవారం డాక్టర్ ప్రసన్నకుమార్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే ధారకొండ పిహెచ్‌సీకి వెళ్లిపోయిన డాక్టర్ నాగభూషణంను కూడా రిలీవ్ చేసి నాతవరం పీహెచ్‌సీలో ఉండేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

ఏడు పంచాయతీ భవనాలకు రూ.2.24 కోట్లు మంజూరు

▸▸ పంచాయతీరాజ్ శాఖ జేఈ సోమశేఖర్

మాకవరపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు పంచాయతీలకు కొత్త భవనాల నిర్మాణాల కోసం రూ.2.24 కోట్లు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ శాఖ జేఈ సోమశేఖర్ తెలిపారు. ఒక్కో భవన నిర్మాణం కోసం రూ.32 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఈ నిధుల్లో రాష్ట్రీయ గ్రామ స్వరాజ పథకం కింద రూ.25 లక్షలు, ఉపాధి హామీ పథకం కింద రూ.7 లక్షలు నిధులు ఖర్చు చేస్తామన్నారు. పెద్దిపాలెం, మునిసిడిపాలెం, మల్లవరం, కె.తూటిపాల, బీఎన్.పేట, చామంతిపురం పంచాయ తీల్లో నూతన భవనాలు నిర్మించనున్నట్టు చెప్పారు. త్వర్లోనే ఈ భవనాల పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

విజయరామరాజుపేట కాజ్‌వే నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

▸▸ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డులోని విజయరామరాజుపేటలో కొట్టుకుపోయిన కాజ్‌వే నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాజ్‌వే కొట్టుకుపోయి నెల రోజులు గడుస్తున్నా పునర్నిర్మాణం చేపట్టలేదన్నారు. దీంతో గౌరీపట్నం ఇరుకు రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు అచ్చంనాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, నాయకులు కొవెల జనార్దనరావు, జోగా కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

15న కంటి వైద్య శిబిరం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏఎల్ పురం గ్రంథాలయం వద్ద సోమవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సత్యసాయి సేవా సమితి సభ్యులు సత్యనారాయణ, రమణ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ శిబిరానికి కృష్ణాదేవిపేట పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కంటి రోగులు పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయనున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9440202297, 9441346407 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

రెడ్‌క్రాస్ యూనిట్‌కు పురస్కారం

మాకవరపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అవంతి యూత్ రెడ్‌క్రాస్ యూనిట్‌కు వార్షిక ప్రశంసా పురస్కారం లభించింది. విశాఖ ఉమ్మడి జిల్లాలో గురువారం నిర్వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ వార్షిక జనరల్ సమావేశంలో జిల్లా రెడ్‌క్రాస్ రెవెన్యూ అధికారి భవానీశంకర్ ద్వారా ప్రశంసాపత్రాన్ని యూనిట్ సభ్యులు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, యూత్‌రెడ్ క్రాస్ యూనిట్ సమన్వయ కర్త రామకృష్ణ, ఎన్సీసీ అధికారి హరికిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివాస్

నర్సీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ప్రతినిధి వెలగా నారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ జాతీయ సమైఖ్యతకు దోహదం చేస్తుందన్నారు. జాతీయ భాష హిందీని అందరూ నేర్చుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు హిందీ భాషపై వ్యక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, హిందీ ఉపాధ్యాయని జయలక్ష్మి పాల్గొన్నారు.

'విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణ ఆపాలి'

చోడవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్య, విద్య రంగాల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి డిమాండ్ చేశారు. గుంటూరులో శనివారం విద్యా రంగ సమస్యలపై నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగదుర్గ, రాజు, నాయుడు పాల్గొన్నారు.

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానం
దేవాదాయ ధర్మాదాయశాఖ
ఆర్.టి.సి. కాంప్లెక్స్ వద్ద, బలిఘట్టం, నర్సీపట్నం

టెండరు కమ్ బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలం, నర్సీపట్నం గ్రామములో వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఈ క్రింది వివరించబడిన ఐటమ్‌నకు తే 17-09-2025 దీ బుధవారం, ఉదయం 11 గంటలకు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వివరము	లీజు కాలం	ప్రథమ ధరావత్తు
1	శ్రీ అమ్మవార్కి భక్తులచే సమర్పించబడి వదిలివేసిన వస్త్రములు (అనగా చీరలు, రవిక గుడ్డలు) తీసుకొనే హక్కు కొరకు	తేది:01-10-2025 నుండి తేది: 30-09-2026 వరకు	రూ.50,000/-లు

వేలంపాట షరతులు:
1) పాటదారులు పాటకు ముందు ధరావత్తు సొమ్ము రూ.50,000/-లు చెల్లించి పాటలో పాల్గొనే నిర్ణయం. 2) పాటలో పాల్గొనుటకు ముందుగా పాటదారులు తమకు గల స్థితిగతులను తెలియజేయు రూ.2,00,000/-లు సాల్వెన్సీ సర్టిఫికెట్ మరియు ఆధార్‌కార్డ్ జతపర్చవలెను. 3) హెచ్చుపాటదారుడు పాట అయిన వెంటనే వేలంపాట మొత్తం సొమ్ము చెల్లించి రశీదు పొందు నిర్ణయం. 4) ఏ కారణం చేతనైనా పాట అపుచేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకు గాని దేవదాయ శాఖ అధికారులకు మరియు కార్యనిర్వహణాధికారి వార్లకు అధికారము కలదు. 5) సదరు పాట దేవదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి పాట జరుగును. 6) మిగిలిన పాట షరతులు వివరములను అలయ కార్యనిర్వహణాధికారి, నర్సీపట్నం వారి వద్ద నుండి పొందగలరు. 7) దేవాలయమునకు ఏమైనా బకాయిలు ఉన్నవారు గానీ, కోర్టు లావాదేవీలు ఉన్నవారు గానీ పాటలో పాల్గొనుటకు అనర్హులు.

ఇట్లు
నర్సీపట్నం గ్రామం — కార్యనిర్వహణాధికారి
తేది:09-09-2025 — శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం, నర్సీపట్నం

వేములపూడి బీసీ హాస్టల్‌లో విద్యార్థిని మృతి

- ఉదయం అనారోగ్యం పాలవ్వడంతో ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లిన వార్డెన్
- ఏరియా ఆస్పత్రి నుంచి విశాఖపట్నం తరలింపు
- మార్గమధ్యంలో పరిస్థితి విషమించడంతో అనకాపల్లి ఆస్పత్రికి తరలింపు
- మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారణ
- పోస్టుమార్టానికి నిరాకరించిన తల్లిదండ్రులు

నర్సీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడి జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని రొంగలి హాసిని శుక్రవారం మృతి చెందింది. ఆమె స్థానిక బీసీ వసతిగృహంలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నది. శుక్రవారం తెల్లవారు జామున 5 గంటలకు కడుపులో నొప్పి, కళ్లు తిరుగుతున్నాయని విద్యార్థినిచెప్పడంతో హాస్టల్ వాచ్‌మన్ గోరు వెచ్చని నీటిలో ఓఆర్ఎస్ కలిపి ఇచ్చాడు. తర్వాత వాంతులు అవుతుండడంతో వార్డెన్ విద్యార్థినిని పీహెచ్‌సీ తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ డ్యూటీ డాక్టర్ విద్యాసాగర్ నాయుడు వైద్య పరీక్షలు చేసి విద్యార్థిని అపస్మారక స్థితిలో వెళ్తుండడంతో 108లో విశాఖపట్నం తరలించారు. మార్గమధ్యలో మాకవరపాలెంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపిస్తామని తల్లిదండ్రులు బలవంతం పెట్టారు. ప్రైవేటు వైద్యుడు పరీక్షించి ఆలస్యం చేకుండా అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లాలని సూచించారు. 108 సిబ్బంది అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లగా.. అప్పటికే మృతి చెందిందని డాక్టర్ నిర్ధారించారు. పోస్టుమార్టం వద్దని మృతదేహాన్ని తల్లిదండ్రులు స్వగ్రామానికి తీసుకుపోయారని రూరల్ ఎస్‌ఐ రాజారావు తెలిపారు. పోస్ట్‌మార్టం చేస్తే ఏం జరిగిందో తెలుస్తుందని చెప్పినప్పటికి వినలేదన్నారు. బాలికది మాకవరపాలెం మండలం బూరుగుపాలెం గ్రామం. గురువారం రాత్రి వసతిగృహంలో పిల్లలందరితో పాటు బెండకాయ కూరతో భోజనం చేసింది. బాలిక అనారోగ్యానికి కారణం ఏమిటో అంతపట్టలేదు. దీనిపై ఏబీసీడబ్ల్యూవో గోపీనాథ్ మాట్లాడుతూ వార్డెన్ బి.వెంకటలక్ష్మి శుక్రవారం పది గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారని తెలిపారు.

విద్యార్థిని మృతిపై పోలీసులకు ఫిర్యాదు

వేములపూడి బీసీ వసతి గృహంలోని 8వ తరగతి విద్యార్థిని రొంగలి హాసిని మృతిపై తల్లి నాగమణి ఫిర్యాదు చేసిందని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. విద్యార్థిని మృతిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేసి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. శవ పంచనామా పూర్తి చేసి శనివారం ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయిస్తామన్నారు.

అనకాపల్లి ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎంగా హనుమశ్రీ


కె.హనుమశ్రీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్‌గా కె.హనుమశ్రీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వాల్తేరు డిపో సహాయ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను. ఉన్నతాధికారులు అనకాపల్లి డిపో ఇన్‌చార్జి మేనేజర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, యానియన్ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. కాగా హనుమశ్రీ 2012లో అనకాపల్లి డిపో సహాయ మేనేజర్‌గా పనిచేశారు.

16న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాల క్రీడా మైదానంలో ఈ నెల 16వ తేదీన అనకాపల్లి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి దాడి శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే 51వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఈ సందర్భంగా ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ పీలా వీరునాయుడు (99632 99492)కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్‌గా నరేశ్


కొఠారు నరేశ్

ఎలమంచిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్‌గా ఎలమంచిలికి చెందిన కొఠారు నరేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ హాకీ అకాడమీ డైరెక్టరు నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హాకీ అసోసియేషన్ కన్వీనర్‌గా మరోసారి నియమితులైన తనపై మరింత బాధ్యత పెరిగిందని, జిల్లాలో హాకీ క్రీడాకారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా నరేశ్ చెప్పారు.

కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

- ఇటీవల అందుబాటులోకి వచ్చిన రూ.45 కోట్ల విలువైన పరికరాలు
- రెండు రోజుల కిందట సేవలు ప్రారంభం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని క్యాన్సర్ విభాగంలో సుమారు రూ.45 కోట్లతో ఏర్పాటుచేసిన అత్యాధునిక వైద్య పరికరాలతో సేవలు ప్రారంభ మయ్యాయి. సిటీ సిమ్యులేటర్, లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీ థెరపీ సహాయంతో రెండు రోజుల కిందట ఒకరికి విజయవంతంగా చికిత్స అందించినట్టు ఆస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ ఐ.వాణి వెల్లడించారు. గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగికి చికిత్స అందించామన్నారు. కొత్త టెక్నాలజీతో క్యాన్సర్ కణితికి మాత్రమే రేడియేషన్ ఇచ్చి, చుట్టూ ఉన్న ఆరోగ్యకరమైన కణాలకు ఎలాంటి హాని కలగకుండా చూడవచ్చునన్నారు. దీనివల్ల తక్కువ దుష్ప్రభావాలతో, మెరుగైన ఫలితాలు లభిస్తాయని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ కేజీహెచ్‌లో కేన్సర్ చికిత్సకు సంబంధించి కొత్త అధ్యాయం మొద లైందన్నారు. ఈ అధునాతన సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో క్యాన్సర్ రోగులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలిగిందన్నారు.

CLASSIFIEDS

EDUCATION

» రెగ్యులర్, డిస్టెన్స్ : 10th, ఇంటర్, డిగ్రీ, PG అడ్మిషన్లు చేయబడును. పరీక్షలకు పూర్తి గైడెన్స్ ఇవ్వబడును. సెల్ : 97036 97959 / 90637 27276

AJB-1193

WANTED

» Wanted PROs (Part Time) to work with Education academy. Quali : Inter / Degree, Send resume : hr@varahaacademy.com

AJB-1194

FLAT FOR SALE

» New 2 BHK Flat for Sale, at Murali Nagar, Visakhapatnam. Under Construction. Lift and Car Parking. Contact: 98663 21992

AJV_241532

» 3BHK, 6yrs old E/F 1350sft fully Wood work, 100ft Road, 54L 2bhk, 1060sft, W/F 2yrs old 39L, Sujathanagar. Ph: 79972 74447, 86391 68165

AJV_241540

VEHICLE FOR SALE

AP05TD9998 - MAHINDRA BOLERO MAXI TRUCK PLUS - 2016. AP37DE5335 - MARUTI VITARA BREZZA LDI(O) - 2017; AP39SU5132 - SUZUKI ACCESS 125CC - 2023; AP39SC3122 - SUZUKI ACCESS 125CC - 2023; AP31CN9299 - TOYOTA ETIOS GD(M) -2014; AP31DJ2187 - MARUTI ERTIGA SHVS VDI - 2016; Cont : Kanakadurga Finance Ltd, Narsipatnam. Cell: 9959802666

AJV_241544

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176 9966165093

అచ్యుతాపురం ఎంపీపీపై అవిశ్వాసం!?

తెరవెనుక పావులు కదుపుతున్న ఓ ఎంపీటీసీ సభ్యురాలి భర్త

- ఈ నెల 24న నోటీసు ఇవ్వాలని నిర్ణయం
- ఎంపీటీసీ సభ్యులను తనవైపు తిప్పుకోవడానికి భారీగా నగదు ఆఫర్
- మొత్తం 21 సభ్యుల్లో 14 మంది తనవైపే ఉన్నట్టు ప్రచారం


మండల పరిషత్ కార్యాలయం

అచ్యుతాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): **అచ్యుతాపురం ఎంపీపీ కోన సంధ్యను పదవి నుంచి దించేయడానికి తెరవెనుక రాజకీయం నడుస్తున్నది. ఆమెపై అవిశ్వాస నోటీసు ఇవ్వడానికి మండల కేంద్రానికి చెందిన ఓ ఎంపీటీసీ సభ్యురాలి భర్త పావులు కదుపుతున్నట్టు తెలిసింది. ప్రస్తుత ఎంపీపీని పదవిలో నుంచి దించేసి ఆ పీఠంపై తన భార్యను కూర్చోబెట్టడానికి ఎంపీటీసీ సభ్యుల మద్దతు కూడకడుతున్నట్టు సమాచారం.**

మండలంలో మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలు వుండగా, నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో వైసీపీ అన్ని స్థానాలకు కైవసం చేసుకుంది. పెదపాడు ఎంపీటీసీ సభ్యురాలు కోన సంధ్యను ఎంపీపీగా ఎన్నుకున్నారు. తర్వాత కొంతకాలానికి దిబ్బపాలెం-3 ఎంపీటీసీ సభ్యుడు మృతిచెందడంతో జరిగిన ఉపఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నీరుకొండ నరసింగరావు గెలుపొందారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎలమంచిలి నుంచి కూటమి తరఫున పోటీ చేసిన జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో అచ్యుతాపురం ఎంపీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి వెంకటలక్ష్మితోపాటు దోసూరు, పూడిమడక-2, ఎంజేపురం, హరిపాలెం ఎంపీటీసీ సభ్యులు జనసేనలో చేరారు. నునపర్తి ఎంపీటీసీ సభ్యుడు టీడీపీలో చేరారు. ప్రస్తుతం ఐదుగురు జనసేన, ఇద్దరు టీడీపీ సభ్యులు వున్నారు. మిగిలిన 14 మంది వైసీపీ సభ్యులే! ఎంపీపీని పదవి నుంచి దించేయాలంటే నాలుగేళ్ల తరువాతే అవిశ్వాస నోటీసు ఇవ్వాలి. కోన సంధ్య ఎంపీపీగా ఎన్నికై ఈ నెల 24వ తేదీతో నాలుగేళ్లు నిండుతాయి. దీంతో ఎంపీపీ పీఠంపై తన భార్యను కూర్చోబెట్టడానికి గత ఏడాది జనసేన పార్టీలో చేరిన అచ్యుతాపురం ఎంపీటీసీ సభ్యురాలి భర్త పావులు కదుపుతున్నట్టు తెలిసింది. ప్రస్తుత ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఈ నెల 24వ తేదీన అధికారులకు నోటీసు అందజేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ నోటీసుపై మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మంది సంతకాలు చేయాలి. ప్రస్తుతం జనసేన, టీడీపీకి కలిపి ఏడుగురు సభ్యులు మాత్రమే వున్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే మరో ఏడుగురు సభ్యులు అవసరం. దీంతో అవిశ్వాస తీర్మాన నోటీసుపై సంతకం చేయడంతోపాటు ఓటింగ్‌లో తమకు అనుకూలంగా వ్యవహరిస్తే పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తానని అచ్యుతాపురం ఎంపీటీసీ సభ్యురాలి భర్త ఆఫర్ చేస్తున్నట్టు తెలిసింది. ఎంపీటీసీలకు మరో ఏడాదిలో ఎన్నికలు జరగనుండడంతో కొంతమంది సభ్యులు ఈ ఆఫర్‌కు అంగీకరించినట్టు సమాచారం. మొత్తం సభ్యుల్లో 14 మంది ప్రస్తుత ఎంపీపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తారని సదరు నేత ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలి

- మాడుగుల హల్వా తయారీదారులకు డీఆర్‌డీఏ రుణాలు
- జిల్లా అంతటా బీఎస్ఎన్ఎల్ సేవలు ఉండాలి
- 'దిశ' కమిటీ సమావేశంలో ఎంపీ సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్. పక్కన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేదల ప్రజలకు అందేలా చూడవలసిన బాధ్యత జిల్లా అధికారి యంత్రాంగంపై ఉందని దిశ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. తొలుత కలెక్టర్ విజయకృష్ణన్.. జిల్లాలో యూరియా పంపిణీ, శాఖల వారీగా అమలవుతున్న సంక్షేమం పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం ఎంపీ రమేశ్ మాట్లాడుతూ, పీఎం విశ్వకర్మ, పీఎం మిషన్ వాత్సల్య, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చూడాలన్నారు. మాడుగుల హల్వా తయారీదారులకు డీఆర్‌డీఏ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీచేయాలని, 108 అంబులెన్స్ వాహనాలకు త్వరగా మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన విద్యుత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. ఇంటి కప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు లేదా 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, ఫీడర్ల సంఖ్య పెంచాలని, తద్వారా ఓవర్ లోడ్ సమస్యలు తగ్గించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డీఎస్ఎస్ కింద రూ.111.83 కోట్లతో చేపట్టిన వ్యవసాయ, వ్యవసాయేతర ఫీడర్ల విభజన, ఓవర్‌లోడు ఫీడర్ల విభజన పనులను డిసెంబరులోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ,సుందరపు విజయ్‌కుమార్, పంచకర్ల రమేశ్‌బాబు, ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈలు, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా ఆదేశం
- అనకాపల్లి రైల్వే స్టేషన్ సందర్శన


రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డీఆర్ఎం మోహిత్ సొనాకియా ఆదేశించారు. శుక్రవారం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన రెండు, మూడు నంబర్ల ప్లాట్‌ఫారాలపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. స్టేషన్‌లో ఇతర ప్రదేశాలను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీనియర్ డీఓఎం నరేంద్రవర్మ, సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్, స్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్, తదితరులు వున్నాయి.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎలమంచిలి విద్యార్థినులు ఎంపిక


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జట్టుకు ఎంపికైన మోక్షిత, రతిక, భవానీ, దుర్గాశ్రావణితో హెచ్ఎం సుశీల

ఎలమంచిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తులసీనగర్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. విశాఖలోని సెయింట్ ఆన్స్ స్కూలులో శుక్రవారం స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి ఫుట్‌బాట్ జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎలమంచిలి పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు పి.మోక్షిత, బి.రతిక, పి.భవానీ, ఇంటర్ విద్యార్థిని కోరుకొండ దుర్గాశ్రావణి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో ఈ నెల 27 నుంచి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా జట్టులో చోటు సంపాదించారు. వీరిని ప్రధానోపాధ్యాయురాలు సుశీల, పీఈటీ మూర్తి, శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయి నిర్మూలనపై స్పష్టమైన కార్యాచరణ

- రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి


రేంజ్ ఎస్పీలతో సమీక్షిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఏజెన్సీలో పూర్తిగా గంజాయి నిర్మూలనపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలుచేయాలని రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. శుక్రవారం రేంజ్ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు 14 మంది నిందితుల నుంచి రూ.10.04 కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకోవడం అభినందనీయమన్నారు.

ఇంకా 1,119 మంది గంజాయి నిందితులపై షీట్లు తెరవడం, 51 మందిపై పీడీ యాక్టు, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుచేయడానికి ప్రతిపాదించామన్నారు. తరచుగా గంజాయి రవాణాచేసే 368 మంది, ఇతర నేరాలతో సంబంధం ఉన్న 370 మందిని గుర్తించామన్నారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిల్‌బుల్ వారెంట్ల ఆధారంగా 341 మందిని అరెస్టు చేఉసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు కోర్టులు శిక్షలు విధించాయని, వీరిలో 24 మందికి 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. రేంజ్ పరిధిలో టెక్నాలజీ వినియోగించి పరారీలో ఉన్న నిందితుల్ని పట్టుకున్న అధికారులను అభినందించారు. భవిష్యతు కార్యాచరణలో భాగంగా గంజాయి రవాణా మార్గాలను అధ్యయనంచేసి అరికట్టే వ్యూహం రూపొందించాలని డీఐజీ సూచించారు. స్త్రీలు, చిన్నపిల్లలపై లైంగిక నేరాలు, తప్పిపోయిన మహిళలు, బాలికల కేసులపై వేగవంతంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు అధిగమించడానికి కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలన్నారు. సమీక్షలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, వకుల్ జిందాల్, తుహిన్ సిన్హా, అమిత్‌బర్దర్ పాల్గొన్నారు.

క్రైం... crime news

గెడ్డలో గల్లంతైన గిరిజనుడి మృతి

అనంతగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మ పంచాయతీ వంజరివలస గ్రామానికి చెందిన బిడ్డ దేముడు గురువారం సాయంత్రం సమరెడ్డిపాలెం వెళుతుండగా మార్గమధ్యలో గల చిట్టంవలస గెడ్డను దాటే క్రమంలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ డీ శ్రీనివాసరావు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిరుపేద కుటుంబ కావడంతో ఎస్‌ఐ శ్రీనివాసరావు అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు, సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు. (ఇన్‌సెట్‌లో) స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు

నక్కపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామంలో ఈ నెల 8వ తేదీన ఒక ఇంటిలో జరిగిన చోరీ కేసును మూడు రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత సోమవారం మధ్యాహ్నం వేంపాడుకు చెందిన కొత్త నాగేశ్వరరావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియన వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయాడు. దీనిపై నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీఎల్ పురం గ్రామానికి చెందిన జి.అప్పారావు ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. శుక్రవారం అతనిని పట్టుకొని 53.73 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.72 వేల నగదు స్వాదీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సమావేశంలో సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో పరారైన వ్యక్తి అరెస్టు

దేవరాపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది గంజాయి కేసులో తప్పించుకున్న కందేరి వెంకటనాగరాజును శుక్రవారం పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. గత ఏడాది గంజాయి కేసులో ఏ3గా ఉన్న వెంకట నాగరాజు పరారీలో ఉన్నాడు. ముందస్తు సమాచారం అందడంతో అతడిని దేవరాపల్లిలో పట్టుకొని చోడవరం కోర్టుకు తరలించినట్టు ఎస్.ఐ.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

మాడుగుల రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకూర్మనాథపురంలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై ఒక వ్యక్తి మృతిచెందాడు. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లంగి సత్యనారాయణ(35) అనే వ్యక్తి శుక్రవారం అదే గ్రామంలో పూరింటిలో నివాసముంటున్న తన బంధువు ఇంటికి వెళ్లాడు. బయట విద్యుత్ బల్బు ఏర్పాటు కోసం ఇంటిలో నుంచి విద్యుత్ తీగను లాగారు. దీనికి విద్యుత్ సరఫరా అవుతుందనే విషయం తెలియని సత్యనారాయణ.. ఆ తీగను తాకడంతో షాక్‌కి గురై పడిపోయాడు. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు నిర్ధారించారు. సత్యనారాయణకు భార్య మౌనిక, నాలుగేళ్ల కుమారై ఉన్నారు. కాగా ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు.

వైబీ పట్నంలో దారుణం

... 5వ పేజీ తరువాయి

డబ్బుల కోసం తరచూ తల్లిదండ్రులను వేధించసాగాడు. దీంతో కొన్ని నెలల క్రితం సొంత ఇంటిని కుమారుడికి ఇచ్చేసి, గ్రామంలోనే వేరే ఇంటిని అద్దెకు తీసుకుని వుంటున్నారు. అయితే ఆరు నెలల క్రితం రామ్మూర్తినాయుడు వేరే ప్రాంతానికి వలస వెళ్లాడు. తల్లిదండ్రులు తిరిగి సొంత ఇంటికి వచ్చి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వైబీపట్నం పక్కనే ఉన్న గన్నవరంలో జరిగిన మరిడమ్మ తల్లి జాతరకు రామ్మూర్తినాయుడు వచ్చాడు. జాతర ముగిసిన తరువాత మద్యం మత్తులో శుక్రవారం తెల్లవారుజామున వైబీపట్నంలో ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను నిద్ర లేపాడు. తండ్రితో గొడవపడి కొట్టాడు. దీంతో జోగినాయుడు బయటకు పరుగెత్తాడు. అనంతరం రామ్మూర్తినాయుడు తన తల్లి మంగను మంచం మీద నుంచి కిందకు నెట్టేసి, పూలకుండితో తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడక్కడే మృతి చెందింది. ఆమె మెడలో ఉన్న బంగారం వస్తువులను తీసుకుని పరారయ్యాడు. కొద్దిసేపటి తరువాత ఇంటికి తిరిగి వచ్చిన జోగినాయుడు.. విగతజీవిగా పడివున్న భార్యను చూసి రోదించాడు. సమాచారం అందుకున్న నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, నాతవరం ఎస్‌ఐ సీహెచ్ భీమరాజు వైబీపట్నం వెళ్లి పరిశీలించారు. జోగినాయుడు నుంచి వివరాలు తెలుసుకున్నారు. రామ్మూర్తినాయుడు మాకవరపాలెం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన దేవి అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకన్నాడని, కొంతకాలం తర్వాత వేధిస్తుండడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిందని డీఎస్పీ తెలిపారు. దీనిపై అనకాపల్లి దిశ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. కాగా జోగినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామ్మూర్తినాయుడుపై కేసు నమోదు చేసి, నర్సీపట్నం సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్లు అధ్వానం.. జనం అవస్థలు

... 5వ పేజీ తరువాయి


గోతులతో అధ్వానంగా తయారైన గునుపూడి రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

నాతవరం- తాండవ రోడ్డులో పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు గతంలో ఇరిగేషన్ శాఖ పరిధిలో వుండేది. కొంతకాలం క్రితం ఆర్‌అండ్‌బీకి బదలాయించారు. రహదారికి కనీస నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో గోతుల్లో నుంచి ప్రయాణం చేయడం ప్రజలకు ఇబ్బందికరంగా వుంది. రహదారిని అభివృద్ధి చేసే వరకు.. కనీసం గోతులు అయినా పూడ్చాలని ఈ మార్గంలో ప్రయాణించే ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

... 5వ పేజీ తరువాయి

పెదబొడ్డేపల్లి పెట్రోల్ బంక్ దాటిన తర్వాత భాస్కరరావు నడుచుకొని రావడం కనిపించిందని తెలిపారు. కాల్ డేటా(సీడీఆర్) వస్తే ఎవరెవరితో ఫోన్ మాట్లాడాడో తెలుస్తుందని అన్నారు. సోమవారం రాత్రి దొరబాబుతో సహా ముగ్గురూ శారదా నగర్‌లోని ఒక లాడ్జిలో దిగారని, మరుసటి రోజు ఉదయం వరకు బయటకు రాలేదని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	132.00
లైవ్ ధర	152.00
విత్ స్కిన్	274.00
స్కిన్ లెస్	284.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559